
# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 150 | హైదరాబాద్ | మంగళవారం 02-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00

11లో

తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి రికార్డు స్థాయిలో స్పందన

## సభలో...
# డ్రామాలు వద్దు..

**పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ముందు విపక్షాలకు ప్రధాని మోదీ హితవు**

- పార్లమెంటులో డ్రామాలు కాకుండా విధానాలపై చర్చ జరగాలన్న ప్రధాని
- విపక్షాలు ఓటమి బాధ నుంచి బయటపడి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచన
- కొత్తగా ఎన్నికైన, యువ ఎంపీలకు మాట్లాడే అవకాశం కల్పించాలని వ్యాఖ్యలు

11లో





11లో

## హైదరాబాద్ మెట్రోలో సెక్యూరిటీ గార్డులుగా
# 20 మంది ట్రాన్స్‌జెండర్లు

**భద్రతా సిబ్బందిగా ట్రాన్స్‌జెండర్లకు కీలక బాధ్యతలు**

- శిక్షణ పూర్తి చేసుకుని సోమవారం నుంచి విధుల్లోకి
- మహిళల భద్రత, సామాజిక సాధికారతకు పెద్దపీట
- తెలంగాణ ప్రభుత్వ సమ్మిళిత విధానాలకు అనుగుణంగా చర్యలు

## మరో కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని
# షేక్ హసీనాకు జైలు శిక్ష




11లో

- భూ కేటాయింపుల కుంభకోణంలో షేక్ హసీనాకు ఐదేళ్ల జైలు శిక్ష
- ఆమె సోదరి షేక్ రెహానాకు ఏడేళ్లు, మేనకోడలికి రెండేళ్ల శిక్ష
- ఇదే కేసులో మరో 14 మందికి ఐదేళ్ల చొప్పున జైలు విధించిన కోర్టు
- ఇవన్నీ రాజకీయ ప్రేరేపిత కేసులని ఖండించిన హసీనా కుటుంబం

## తిరుపతిలోని హోటళ్లకు
# బాంబు బెదిరింపులు..

**కపిలతీర్థం వద్ద ఉన్న రెండు హోటళ్లకు బెదిరింపులు**

- రంగంలోకి దిగిన బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలు
- ఇటీవలే కలెక్టరేట్, టీటీడీకి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చిన వైనం



11లో

## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు
# హాజరుకండి

**పారిశ్రామికవేత్తలకు మంత్రి అజారుద్దీన్ పిలుపు**



11లో

- హైదరాబాద్‌లో జరిగిన బిటీ గోల్ఫ్ 2025–26 ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా మంత్రి అజారుద్దీన్
- డిసెంబర్ 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ
- ఈ సదస్సుకు హాజరుకావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపు
- సీఎం రేవంత్ రెడ్డి ట్రిలియన్ డాలర్ల లక్ష్యంలో ఇదో కీలక అడుగని వెల్లడి



11లో

## శ్రీకాకుళం జిల్లాలో
# డయేరియా కేసులు..

**ఆరా తీసిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

- జిల్లాలోని సంతబొమ్మాళి మండలం తాళ్లవలస గ్రామంలో డయేరియా కేసులు
- గ్రామంలోని పరిస్థితిని వివరించిన వైద్యారోగ్య శాఖ అధికారులు

## ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు..



11లో

# ప్రైవేట్ రంగంలో న్యూక్లియర్ ఎనర్జీ..

న్యూక్లియర్ ఎనర్జీ.. వినియోగించే తీరుపై దీని పవర్ ఆధారపడి ఉంటుంది. విధ్వంసానికి వాడితే ప్రపంచం నాశనం అవుతుంది. సద్వినియోగం చేసుకుంటే అనేక దేశాలు అభివృద్ధి చెందుతాయి. యురేనియంతో ఉత్పత్తి చేసే పవర్‌తో విద్యుత్ ధరలు చాలా వరకు తగ్గుతాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీ ఇటీవల ప్రైవేటు సంస్థలుకు న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తిలో భాగస్వామ్యం అందించే నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం 8?10 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న భారత్ రాబోయే కాలంలో 100 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇది విద్యుత్ బిల్లులు 5,000 నుంచి 500 రూపాయల వరకు తగ్గే అవకాశాన్ని కలిగిస్తుంది.ప్రపంచంలో న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తిలో చైనా మొదటి, అమెరికా రెండో స్థానంలో ఉండగా, భారత్ మూడో స్థానంలో నిలిచింది. యురేనియం సమృద్ధితో, భారత్ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ఈ శక్తిని మరింత విశాలపరిచే అవకాశాలు ఉన్నాయి. అమెరికా, కెనడా వంటి దేశాల సంస్థలు భారత్‌లో పెట్టుబడులు పెడితే స్థాయి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.ప్రైవేటీకరణతో న్యూక్లియర్ ఉత్పత్తి పెరిగితే విద్యుత్ తీవ్రంగా సరఫరా అవ్వడం వల్ల పాకిస్తాన్ కు భయాందోళనలు ఏర్పడతాయని నిపుణులు భావిస్తున్నారు. అణు విద్యుత్తుకు అవసరమైన యురేనియం ను తవ్వడానికి, దిగుమతి చేసుకోవడానికి, ప్రాసెస్ చేయడానికి ప్రైవేట్ సంస్థలను అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. 2047 నాటికి అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 12 రెట్లు పెంచాలని యోచిస్తోంది. అలా జరిగితే భారతదేశ మొత్తం విద్యుత్ అవసరాలలో 5% అణు విద్యుత్తు ద్వారా తీరుతుంది. అణు విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన నియంత్రణ వ్యవస్థ పరికరాలను సరఫరా చేయడానికి ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పిస్తారట.ప్రభుత్వ డేటా ప్రకారం.. భారతదేశంలో 76, 000 టన్నుల యురేనియం ఉందని అంచనా. ఇది 30 సంవత్సరాల పాటు 10,000 మెగావాట్ల అణు విద్యుత్తుకు ఇంధనంగా సరిపోతుంది. ఈ నేపథ్యంలో భారతదేశం తన ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. ఇంధన విషయంలో దేశం ఎంతో ప్రగతి సాధించాలి. సోలార్, గ్రీన్ హైడ్రోజన్ వైపు నడవాల్సి ఉంది. అణు ఇంధనంపై కూడా దృష్టి సారించి వేగంగా అడుగులు వేయాలి. అణు విద్యుత్తులో ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానిస్తాం. పెట్రోల్, డీజిల్ దిగుమతుల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాం. కొత్త ఇంధనాల సహాయంతో దిగుమతులను తగ్గించుకోవచ్చు. ఆ దిగుమతులు తగ్గితే స్వయం సమృద్ధి సాధ్యమవుతుంది. నేడు ప్రపంచమంతా ఖనిజాల గురించే ఆలోచిస్తోంది’ అని తాజాగా ప్రధాని వ్యాఖ్యానించారు.బడ్జెట్‌లో ఎక్కువ భాగం ఇప్పటికీ పెట్రోల్, డీజిల్, గ్యాస్ దిగుమతి చేసుకోవడానికే పోతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. సౌర, హైడ్రోజన్, జల, అణుశక్తిలో ప్రధాన విస్తరణలతో పాటు సముద్ర వనరులను ఉపయోగించుకునేందుకు నేషనల్ డీప్ వాటర్ ఎక్స్‌ప్లోరేషన్ మిషన్‌నూ ప్రారంభించనట్లు ఆయన ప్రకటించారు.భారత్‌లో అణు విద్యుత్, ఇతర న్యూక్లియర్ పరిశోధనలు పూర్తిగా ప్రభుత్వరంగంలోనే కొనసాగుతున్నాయి. ‘అటామిక్ ఎనర్జీ యాక్ట్ -1962’ ద్వారా ఈ రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ చట్టం స్థానంలో మోదీ సర్కారు కొత్త చట్టం తీసుకొచ్చి ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించాలని నిర్ణయించింది. అందుకోసం డిసెంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ‘ది అటామిక్ ఎనర్జీ బిల్-2025’ను ప్రవేశపెట్టబోతోంది. అణు విద్యుత్ విభాగంలో ప్రైవేటు రంగానికి అవకాశం కల్పించేలా 2025-26 వార్షిక బడ్జెట్‌లోనే నిర్ణయం తీసుకున్నట్లు గత ఆగస్టులో అణు ఇంధన విభాగం వెల్లడించింది. ‘సివిల్ లయబిలిటీ ఫర్ న్యూక్లియర్ డ్యామేజ్ యాక్ట్-2010’ (సీఎల్ఎన్‌డీ)కి కూడా సవరణలు చేయనున్నారు. ప్రస్తుతం మనదేశంలో ప్రస్తుతం అణువిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 8,880 మెగావాట్లు ఉంది. దీనిని 2031-32 నాటికి 22,480 మెగావాట్లకు పెంచాలని నిర్ణయించారు. 2070 నాటికి పూర్తిగా కాలుష్యరహిత మార్గాల ద్వారానే (నెట్ జీరో) విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఇంతకుముందు న్యూక్లియర్ భూగర్భ సాంకేతికతపై భారత్ పెరిగిన అసలు శక్తిని చూసి చైనా కూడా ఈ వ్యూహంతో ఇబ్బంది పడుతుందని అంచనా. ఈ కొత్త ప్రణాళిక భారత్‌కు భద్రత, ఆర్థిక వృద్ధికి విప్లవాత్మక మార్గదర్శకంగా నిలుస్తుంది.

# భూసేకరణకు అంతే లేదా...

విజయవాడ,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

ప్రభుత్వం పారదర్శకంగా ఉండాలి. ప్రజలకు తాము తీసుకుంటున్న నిర్ణయాలను వివరించాలి. గోప్యంగా ఉంచితే అనేక అనుమానాలు బయలుదేరతాయి. రాజధాని అమరావతి విషయంలోనూ ఇదే జరుగుతుంది. గతంలో మొదటిదశలో రైతుల నుంచి సేకరించిన 34 వేల ఎకరాలు, ప్రభుత్వానికి సంబంధించిన భూములు మొత్తం యాభై నాలుగు వేల ఎకరాలున్నాయి. అయితే ఈ యాభై నాలుగు వేల ఎకరాల్లో కేవలం ఏడు వందల ఎకరాలు మాత్రమే మిగిలాయని ప్రభుత్వం చెబుతుంది. మరొకసారి రెండో విడత భూసేకరణకు సిద్ధమయింది. దీంతో అనేక అనుమానాలు ప్రజలు, రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రధాన మీడియాల్లోనూ, సోషల్ మీడియాల్లోనూ అనేక రకాలుగా ప్రచారం జరుగుతుంది. కప్పి ఉంచడం వల్ల రెండో విడత సమీకరణపై వడే అవకాశముంది.రాజధాని పేరుతో సేకరించిన తొలివిడత 54 వేల ఎకరాల్లో రాజధాని ఎక్కడ అన్నది చెప్పాలన్నది ప్రజల నుంచి వినిపిస్తున్న ప్రశ్న. ముంబయి ఛత్రపతి విమానాశ్రయం 1850 ఎకరాల్లో ఉంటే అమరావతికి ఐదు వేల ఎకరాలు ఎందుకన్న ప్రశ్న తలెత్తుంది. పైసా తీసుకోకుండా రాజధాని కోసం రైతులు భూములు ఇస్తే పప్పు బెల్లాలుగా ఇష్టమొచ్చినట్లు పంపిణీ చేయడం ఏంటన్న ప్రశ్న తలెత్తుంది. ఇంజినీరింగ్ కళాశాలలకు ఎకరం యాభై లక్షలకు కేటాయించినా కనీసం రాజధాని రైతుల పిల్లలకు ఆ కళాశాలల్లో రాయితీ కూడా ఇవ్వడం లేదు. తామిచ్చిన భూముల్లోనే తమపై పెత్తనం ఎందుకని కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. మొదటి దశలో 25 గ్రామాల నుంచి 34 వేల ఎకరాలు తీసుకున్నారు. 29 వేల మంది రైతులు భూములు ఇచ్చారు. వారికి ఇచ్చిన ప్లాట్లకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా రెండో విడత భూసమీకరణకు ప్రభుత్వం ఎందుకు సిద్ధమవ్వాలని వారు ప్రశ్నిస్తున్నారు.ఒకవైపు తమ సమస్యలు పదకొండేళ్ల నుంచి అలాగే ఉన్నా, మరికొందరిని బలి చేయడానికి ఎందుకు నిర్ణయాలు తీసుకుంటారని రాజధాని రైతులు ప్రశ్నిస్తున్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కూడా ఇదే ప్రశ్నను లేవనెత్తారు. రాజధానికి రెండో విడత భూసమీకరణకు భూములిచ్చి తొలి విడత ఇచ్చిన రైతులకు అన్యాయం చేయవద్దని ఆయన కోరుతున్నారు. అసలు యాభై నాలుగు వేల ఎకరాలకు ఎవరెవరికి ఇచ్చారని శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా ఒకటి అభివృద్ధి జరిగిన తర్వాత మరొక దానిని అభివృద్ధి చేయడం కోసం సేకరించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ పనిచేయకుండా రాజధాని నిర్మాణానికి ఎన్ని వేల ఎకరాలు కావాలో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.మొదటి దశలో ఇచ్చిన భూముల్లో డిజైన్లు వేసి రాజధాని నిర్మాణానికి ఓకే అని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు తాజాగా మలి విడత భూసమీకరణకు తాము ఎందుకు సహకరించాలన్న ప్రశ్న రైతుల నుంచి సూటిగా వినిపిస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పారదర్శకంగా రాజధాని భూముల విషయంలో వ్యవహరించాలని కోరుతున్నారు. అలాగని ముందుకు వెళితే తాము న్యాయస్థానాలను ఆశ్రయించక తప్పదని వడ్డే శోభనాద్రీశ్వరరావు లాంటి రైతు సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ఏ రాష్ట్రంలోనైనా



విమానాశ్రయం ముప్ఫయి నుంచి నలభై కిలోమీటర్ల దూరంలో ఉంటుందని, కానీ రాజధాని నడిబొడ్డులో విమానశ్రయం నిర్మాణం అవసరమా? ఇక గన్నవరం విమానాశ్రయాన్ని ఏం చేయనున్నారో చెప్పాలంటూ నిలదీస్తున్నారు. మొత్తం మీద రెండో విడత భూసమీకరణ మాత్రం ప్రభుత్వానికి అంత తేలికగా కనిపించడం లేదు.

### తప్పు పడుతున్న వైసీపీ, కాంగ్రెస్

అమరావతి రెండో విడత ల్యాండ్ పూలింగ్ వద్దని కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ షర్మిల స్పష్టం చేసారు. రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ మాఫియా జరుగుతోందన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆమె మొదటి దశలో 25 గ్రామాల నుంచి 34 వేల ఎకరాలు తీసుకున్నారు.. 29 వేల మంది రైతులు భూములు ఇచ్చారు. ఇది కాకుండా ప్రభుత్వ భూములు కలుపుకునే 54 వేల ఎకరాలు ఉందన్నారు. 11 ఏళ్లుగా అమరావతికి రూపు లేదు. ఒక్క కిలోమీటర్ అభివృద్ధి కూడా జరగలేదు. 54 వేల ఎకరాల్లో అమరావతి నిర్మాణం జరిగినట్లు బిల్డప్ ఇస్తున్నారని ఆరోపించారు. తీసుకున్న 54 వేల ఎకరాల సంగతి ఏంటి ? మీరు చెప్పిన అభివృద్ధి ఎక్కడ ? రెండో విడత భూములు 16 వేల ఎకరాలు ఇప్పుడు ఎందుకో చెప్పాలని డిమాండ్ చేసారు. అమరావతి రైతులను చంద్రబాబు బెదిరిస్తున్నారని.. అమరావతి అంతర్జాతీయ నగరం కావాలంటే రెండో విడత కావాలని బ్లాక్ మెయిల్ చేస్తున్నరని మండిపడ్డారు. అమరావతి మున్సిపల్ సిటీగా కావాలా...గ్లోబల్ సిటీగా కావాలని అడగడం విడూరం ప్రపంచంలోనే గ్లోబల్ సిటీ అన్నప్పుడు మున్సిపాలిటీ అని అర్థం కాలేదా అని ప్రశ్నించారు. 29 వేల మంది రైతులను మీరు వెన్నుపోటు పొడుస్తున్నారు.. 34 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల భూములకు విలువ లేనట్లు మాట్లాడుతున్నారు. రెండో విడత భూములు ఇవ్వక పోతే.. అమరావతి రాజధాని కాదు అని బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. మొదటి దశ భూములకు విలువ ఉండాలి అంటే రెండో విడత ఇవ్వాలి అనడం దుర్మార్గమన్నారు. రెండో విడత భూములు ఇవ్వకపోతే రాజధాని నిర్మాణం జరగదా 29 వేల మంది రైతులు మిమ్మల్ని ఏమనుకోవాలి ? మంత్రి నారాయణ కేవలం 700 వందల ఎకరాలు మాత్రమే మిగిలింది అని చెప్పారట .. 54 వేల ఎకరాల్లో 700 ఎకరాలు మిగలడం ఏంటని ప్రశ్నించారు. చేసిన భూ కేటాయింపులకు ఎంత ఆదాయం...ఎన్ని ఉద్యోగాలు వస్తాయి ? ఈ వివరాలు అన్ని ఎందుకు దాచి పెడుతున్నారో చెప్పాలన్నారు. ప్రపంచ దేశాల్లో ఒలంపిక్స్ నిర్వహించిన బీజింగ్,లండన్ దేశాల్లో చూస్తే 150 ఎకరాల్లో దాటలేదు. ఇక్కడ స్పోర్ట్ సిటీకి 2500 ఎకరాలు ఎందుకో చెప్పాలన్నారు. విశాఖ అఎఎ సమ్మిట్ లో వచ్చిన పెట్టుబడులు 13 లక్షల కోట్లు ఇందులో 90 శాతం విశాఖలోనేనని గుర్తు చేశారు. మొదటి విడత రైతులకు న్యాయం చేయని వాళ్ళ..రెండో విడత రైతులకు ఎలా చేస్తారో చెప్పాలన్నారు. రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత అయినప్పుడు ఇన్ని లక్షల కోట్లు ఎందుకు అప్పు చేస్తున్నారు ? . సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అని చెప్పి భూములు ఎందుకు అమ్మాలని చూస్తున్నారు వెంటనే శ్వేత పత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు కూడా ల్యాండ్ పూలింగ్ ను వ్యతిరేకించారు. అమరావతి రాజధాని అభివృద్ధిని ‘మెగా సీరియల్’లా నడుపుతూ రైతుల భూములపై దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, అమరావతికి అసలైన ‘విలన్’ చంద్రబాబు నాయుడేనన్నారు. పదేళ్ల క్రితం చంద్రబాబు ‘ప్రపంచస్థాయి రాజధాని’ నిర్మిస్తామని ప్రగల్భాలు పలికి, రైతులను మోసం చేశారు. ఏపీకి ప్రపంచ స్థాయి రాజధాని అవసరం లేదన్నారు. ఇప్పటికీ తొలి విడత భూములకు పూర్తిగా రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వలేదన్నారు. రైతులు అడిగితే అధికారులు అవమానపరుస్తున్నారు. 18 నెలల్లో రాజధాని ప్రాంతంలో తట్టెడు మట్టి ఎత్తలేదని అంబటి ఆరోపించారు. అమరావతిలో ఒక్క శాశ్వత భవనం కూడా లేదని, చంద్రబాబు నిర్మించినవన్నీ తాత్కాలికమేనని అంబటి రాంబాబు చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే భూముల ధరలు పెరుగుతాయని ప్రచారం చేశారని, కానీ ఇప్పుడు రియల్ ఎస్టేట్ పడిపోయిందన్నారు

# పిఠాపురంలో నిండా మునిగిన అధికారులు

కాకినాడ, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

పిఠాపురం మున్సిపాల్టీలో ఇంజనీరింగ్ అధికారులపై చర్యలకు ప్రభుత్వం ఆదేశం.. వైసీపీ నేతల మాటలు విని నిండా మునిగారా..?ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం మున్సిపాలిటీలో అవినీతి అధికారులపై చర్యలకు ఆదేశించింది ప్రభుత్వం.. గత వైసీపీ పాలనలో జరిగిన అవినీతిపై విచారణ చేసిన అధికారులకు అక్రమాల దోపిడీ బట్టబయలయ్యింది.. దీంట్లో భాగంగా కొందరు అధికారులపై చర్యలకు ఉపక్రమించారు ఉన్నతాధికారులు.. పిఠాపురం మున్సిపాలిటీలో గత పాలకులను నమ్మి పనిచేసిన పాపానికి కొంత మంది అధికారులు నిండా మునిగిపోయిన పరిస్తితి కనిపిస్తోంది.. పిఠాపురం మున్సిపాల్టీలో గతంలో ఇక్కడ పనిచే సిన ఇద్దరు డీఈలతోపాటు, ముగ్గురు ఏఈలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. విజిలెన్స్ అధి కారులు ఇచ్చిన నివేదికపై అక్రమాలకు పాల్పడ్డ అధికారులపై ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. వైసీపీ హయాంలో జరిగిన పాపాలకు ఇప్పుడు అధికారులు బలవ్వడం స్థానికంగా సంచలనంగా మారింది.పిఠాపురం మున్సిపాలిటీలో అవినీతికి అంతే లేదని ఆరోపణలు వెల్లువెత్తాయి.. చేయని పనులకు బిల్లలు పెట్టుకుని దోపిడీ పర్వానికి పాల్పడ్డారని ప్రజలు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాధులు లేని పరిస్థితి కనిపించింది.. వేయని తాగునీటి పైపులైను వేసినట్లుగా చూపించి బిల్లులు డ్రా చేయడం, వేయని రోడ్లు వేశామని బిల్లులు సృష్టించి కాజేయడం వంటి ఆరోపణలు ఇక్కడ పనిచేసిన అధికారులపై తీవ్రంగా ఉంది.. వైసీపీ పాలనలో పిఠాపురం మున్సిపాల్టీలో 14వ ఆర్థిక సంఘం నిధులకు సంబందించి జరిగిన అభివృద్ధి పనుల్లో సుమారు రూ.7 కోట్ల నిధులు గోల్‌మాల్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తగా ఆ ఆరోపణలు, ఫిర్యాదులు అన్నీ బుట్టదాఖలు అయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక, పైగా పిఠాపురం ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ గెలిచాక అందరిలోనూ భయం మొదలయ్యింది.. పిఠాపురం పురపాలక సంఘ పరిధిలో అభివృద్ధి పేరిట అనేక అవకతవకలు జరిగినట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారించారు. వీటిలో ముఖ్యంగా జగ్గయ్యచెరువు కాలనీ, డ్రైవర్స్ కాలనీతోపాటు, మాధవపురం రోడ్డులోని మున్సిపాల్టీకి చెందిన ప్రాంతంలో జరిగిన పనుల్లో




లోని భారీ అవకతవకలను విజిలెన్స్ అధికారుల కమిటీ గుర్తించింది. గుడ్డిగా పనులు చేసి, బిల్లులు మంజూరు చేసారని. అన్ని తెలిసి అధికారులు వ్యవహరించారని నిర్ధారించింది. ఏకంగా రూ.30 లక్షల నిధులకు అసలు పనులు జరగలేదని, అయినప్పటికీ ఆ నిధులను డ్రా చేసినట్లు తేల్చింది. వీటితోపాటు పనులు నాసిరకం, ఇష్టానుసారంగా నిధుల దుర్వినియోగం జరిగాయని విజిలెన్స్ లో స్పష్టం చేసింది. ఈ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.1339 ని విడుదల చేసింది. నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.పిఠాపురం మున్సిపాల్టీలో డీఈలుగా పనిచేసిన భవానీ శంకర్, ఎమ్.టి.హుస్సేన్ పాటు, ఏఈలుగా పనిచేసిన వంశీ అభిషేక్, నరసింహ రావు, రత్నవల్లిలపై ప్రభుత్వం చర్యలకు ఆదే శించింది. వీరు పనిచేసిన కాలంలో జరిగిన పనుల్లో భారీ అవకతలను విజిలెన్స్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. 184 పేజీలతో కూడిన ఆ నివేదికతో కలిపి ప్రభుత్వం అధికారులపై చర్యలు తీసుకోవాలని తాజాగా జీవో జారీ చేసింది. ఆరోపణలను ఎదుర్కొంటున్న ఈ అధికారులంతా ప్రస్తుతం వేరే చోట్ల పనిచేస్తున్నారు.అప్పట్లో పిఠా పురంలో ఉన్న వైసీపీ నేతల అండతో వీరంతా ఇష్టా నుసారంగా అవకతవకలకు ఆజ్యం పోశారు. ముఖ్యంగా వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు గు గుడ్డిగా ఎమ్ బుక్ లను చేయడం. బిల్లులు డ్రా చేసేందుకు అనుకూలంగా సంతకాలు చేశారు. జరగని పనులకు కూడా జరిగినట్లుగా చూపించి నిధులు డ్రా చేసి అడ్డంగా బుక్కయ్యారు. గతంలో దీనిపై పిఠాపురం టీడీపీ కౌన్సిలర్లు పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో చర్చించడం, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం చేసినప్పటికీ, అప్పట్లో వైసీపీ అండతో వీరంతా లెక్క చేయకుండా పని చేశారు. ప్రస్తుతం ఆ పర్యవసనాలను ఎదుర్కొంటున్నారంటున్నారు.

# స్థానిక ఎన్నికలకు దూరమేనా


విజయవాడ,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

వైసీపీ అధినేత వైఎస్ జగన్ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు కనిపించడం లేదు. మరో రెండు నెలలు మాత్రమే ఎన్నికలకు సమయం ఉంది. జవరి లో ఆంధ్రప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయి. అయితే స్థానిక సంస్థల ఎన్నిలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే దిశగా మాత్రం జగన్ ఏ మాత్రం ఫోకస్ పెట్టలేదు. స్థానికసంస్థల ఎన్నికల్లో ఎటూ అధికార పార్టీకి అనుకూలంగా ఫలితాలు ఉంటాయని భావించి వాటిని వదిలేశారా? అన్న అనుమానం వ్యక్తమవుతుంది. నిజానికి స్థానికసంస్థల ఎన్నిలకు ముందస్తు ప్రిపరేషన్ చేసుకోవాలంటే తొలుత నియోజవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించాలి. అనేక నియోజకవర్గాల్లో ఇప్పటికీ పార్టీకి ఇన్ ఛార్జులు లేరు.అంటే జగన్ స్థానిక సంస్థల ఎన్నికలపై సీరియస్ గా లేనట్లే కనిపిస్తుంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన తర్వాత మాత్రమే తమ ఓటు బ్యాంకు, పార్టీ క్యాడర్ గ్రామ, మండల, మున్సిపాలిటీ, కార్పొరేషన్ స్థాయిలో స్థిరపడుతుందని జగన్ భావిస్తున్నప్పటికీ ఇప్పటి నుంచే ఎందుకన్న ధోరణిలో జగన్ ఉన్నట్లు కనిపిస్తుంది. జగన్ స్థానిక సంస్థల ఎన్నికల కోసం జిల్లాల పర్యటనలు చేయాల్సిన అవసరం లేదు. అలాగని ఊరికే కూర్చోకూడదు. ముందుగా నియోజకవర్గాల్లో ఇన్ ఛార్జులను నియమించడంతో పాటు లోకల్ ఎన్నికలకు సంబంధించి తన మనసులో ఉన్న మాటలను నియోజకవర్గాల ఇన్ ఛార్జులకు చెప్పాలి. అప్పుడే అభ్యర్థుల ఎంపికలో ఒక స్పష్టత ఉంటుంది.అభ్యర్థుల ఎంపిక స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకం. తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయంలో కూర్చుని అభ్యర్థులను నిర్ణయించలేరు. అలాగని ఎన్నికలు జరిగే సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద క్యాడర్ బలంగా నిలబడాలంటే జగన్ స్వయంగా రంగంలోకి దిగి ముఖ్యమైన కార్యకర్తలతో సమావేశం కావాల్సి ఉంటుంది. కానీ వైసీపీ ఓటమి పాలయి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకూ అలాంటి చర్యలు తీసుకోలేదు. కొన్ని పర్యటనలకు వెళుతున్నా.. జనం, క్యాడర్ భారీగానే వస్తున్నప్పటికీ వారు ఎన్నికల సమయం ఉండేవరకూ జగన్ వారితో ముఖాముఖి మాట్లాడుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి పనులను కూడా చేపట్టకపోతే కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడటానికి కూడా రారు. జగన్ ఇప్పటికైనా మేలుకుంటే మంచిదన్న సూచనలు సీనియర్ నేతల నుంచి వినిపిస్తున్నాయి.

## ప్రతిపక్ష పార్టీపై ప్రశ్నలా...


# నారాయణ... నారాయణ

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:



సీపీఐ జాతీయ నేత నారాయణ చేస్తున్న వ్యాఖ్యలు ఆ పార్టీని మరింత కిందకు చేరేలా చేస్తున్నాయి. అసలే దేశంలోనే కాదు.. అన్ని రాష్ట్రాల్లో సీపీఐ అనేది ఎక్కడా కనిపించడం లేదు. ఇప్పుడు ఏపీలోనూ నారాయణ పూర్తిగా పార్టీని తుడిచిపెట్టడానికి కంకణం కట్టుకున్నట్లు కనిపిస్తుంది. నారాయణ చచ్చిపోయిన పామును చంపుతూనే ఉండటం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. వైసీపీ పై ఇప్పుడు ఎన్ని విమర్శలు చేసినా ఫలితం లేదు. సీపీఐ ఒక్క అడుగు కూడా పైకి లేవదు. పరకామణి కేసులో వెంటనే స్పందించిన సీపీఐ నారాయణ రాజధాని అమరావతి రెండో దశ భూసమీకరణ విషయంలో అసలు మాట్లాడకపోవడం కూడా చర్చనీయాంశమైంది. విశాఖ స్టీల్ ప్లాంట్ పై కూడా పెదవి విప్పడం లేదుప్రజలకు పనికి రాని వాటిన్నంటినీ నారాయణ పట్టుకుని వేలాడుతున్నట్లే కనపడుతుంది. బిగ్ బాస్ పై పెద్ద పోరాటమే చేస్తున్నాడు. అది అవసరమా? చూసేవారు చూస్తారు. లేకుంటే లేదు. వైసీపీ ఇప్పుడు అధికారంలో లేదు. దానిని ప్రశ్నించి నిలదీసినా ఏ మాత్రం ప్రయోజనం లేదు. అసలు విషయాలను పక్కన పెట్టి రాజధాని అమరావతి కోసం పదకొండేళ్ల క్రితం భూములిచ్చిన రైతులకు అండగా నిలబడాల్సిన నారాయణ అది పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పరకామణి కేసులో సీఐడీ చర్యలు తీసుకుంటుంది. అందులో తప్పు జరిగిందని భావిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కానీ రాజధాని రైతులకు అండగా నిలిచేదెవరు? ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన నారాయణ ప్రతిపక్షాన్ని నిలదీయడంలో అర్థం లేనిదన్న కామెంట్స్ సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తున్నాయి.అసలు నారాయణ తన పార్టీ నిర్ణయాన్ని స్పష్టంగా చెబితే బాగుంటుంది. నాడు రాజధాని అమరావతిలోనే ఉండాలని సీపీఐ ఆధ్వర్యంలో పెద్దయెత్తున ఉద్యమం చేశారు. అది వైసీపీ ప్రభుత్వ హయాంలో. కానీ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేయడంలోనూ, రాజధాని అమరావతి విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రశ్నించడంలోనూ నారాయణ ఎందుకో వెనకబడినట్లే కనిపిస్తుంది. బీజేపీతో చేతులు కలిపిన టీడీపీని పరోక్షంగా నారాయణ సమర్థిస్తున్నారన్న ప్రచారం మాత్రం సోషల్ మీడియా వేదికగా ఎక్కువగా జరుగుతుంది. పరకామణి సంగతి పక్కన పెట్టి నారాయణా.. ఇకనైనా రైతుల పక్షాన నిలిస్తే బాగుంటుందన్న సూచనలు సొంత పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి. మరి నారాయణ మారతారా? లేదా?

# విశాఖలో మల్టీ లెవల్ పార్కింగ్..




విశాఖపట్టణం, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

ఆసియా ఖండంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటి. అటు అనకాపల్లి నుంచి ఇటు భోగాపురం వరకూ అన్ని ప్రాంతాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయి. అయితే విశాఖను మాత్రం ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. విశాఖలో పెరుగుతున్న జనాభాకు తోడుగా వాహనాల సంఖ్య పెరగటం , మౌలిక సదుపాయాలు కొరత దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. అలాగే విశాఖ పోర్టు ప్రాంతం కావటంతో.. పోర్టు, పారిశ్రామిక ప్రాంతాల వద్ద క్రేన్లు, భారీ ట్రక్కులు తిరుగుతూ ఉంటాయి. దీంతోనూ వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతూ ఉంటుంది. ఇరుకైన రహదారులు, జంక్షన్లు కూడా విశాఖలో ట్రాఫిక్ సమస్యకు కారణమనే వాదన ఉంది. సిగ్నల్ సమన్వయం లేకపోవటంతో పాటుగా రింగ్ రోడ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణంలో జాప్యం కూడా కారణమేనన్న విమర్శలు ఉన్నాయి. ఇక విశాఖలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పోలీసులు అస్త్రం యాప్ వంటి టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నారు. కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణంపై అధికారులు ఫోకస్ పెట్టారు.అయితే విశాఖవాసులను ట్రాఫిక్ సమస్యలతో పాటు మరో సమస్య కూడా వేధిస్తోంది. అదే పార్కింగ్ సమస్య. సరైన పార్కింగ్ సదుపాయాలు లేక చాలాచోట్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జగదాంబ జంక్షన్, విశాఖ కేజీహెచ్, విశాఖ కలెక్టరేట్లతో పాటుగా ఇతర గవర్నమెంట్ ఆఫీసుల వద్ద కూడా పార్కింగ్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే ఈ సమస్యకు ప్రస్తుతం కాస్త ఉపశమనం కలిగిందనే చెప్పొచ్చు. పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ రూ.11 కోట్లతో జగదాంబ జంక్షన్ వద్ద మల్టీలెవల్ కారు పార్కింగ్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇది అందుబాటులోకి వచ్చింది.ఈ మల్టీ లెవల్ కార్ పార్కింగ్‌ను ఐదు అంతస్తులతో ఏర్పాటు చేశారు. ఇనుప గ్రిల్స్‌తో తయారు చేసి, వాహనాల పార్కింగ్ కోసం హైడ్రాలిక్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయం వద్ద కూడా ఇదే తరహాలో మల్టీ లెవల్ కారు పార్కింగ్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ మల్టీ లెవల్ కార్ పార్కింగ్‌లో వాహనానికి గంటకు 40 రూపాయలు వసూలు చేస్తున్నారు. మొదటి గంటను 40 రూపాయలు.. ఆ తర్వాతి నుంచి ప్రతి గంటకూ 20 రూపాయలు చొప్పున అద్దె నిర్ణయించారు. వాహనదారుల సౌలభ్యం కోసం 3 వేల 500 రూపాయలతో నెలవారీ పార్కింగ్ పాస్ కూడా అందుబాటులోకి తెచ్చారు.

# అంతుపట్టని వ్యూహం

కాకినాడ, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:



పవన్ కళ్యాణ్ ఒక వ్యూహం ప్రకారం అడుగులు వేస్తున్నారు. అది స్పష్టంగా తెలుస్తుంది కూడా. ఒకవైపు తన శాఖల ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారు. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల విధ్వంసాలను బయటకు తెస్తున్నారు. ఏకకాలంలో అభివృద్ధి, వైసిపి వైఫల్యాలు ప్రజలకు అర్థమయ్యేలా చేస్తున్నారు. మొన్న మధ్యన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూముల ఆక్రమణ వ్యవహారం పవన్ బయట పెట్టిన తర్వాత ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. తాజాగా పల్లె పండుగ 2.0 ప్రారంభం కావడంతో పల్లెల్లో సందడి నెలకొంది. ఏకకాలంలో పవన్ వ్యూహం తెలియక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సతమతం అవుతోంది. పవన్ విషయంలో ఎలా ముందుకెళ్లాలో తెలియక మల్లగుల్లాలు పడుతోంది. పవన్ వ్యూహాత్మక శైలి విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరుస్తుంది.కూటమి సమన్వయంతో ముందుకు సాగుతోంది. సీఎం చంద్రబాబు పాలనపై పూర్తిగా దృష్టిపెట్టారు. లోకేష్ విదేశీ పెట్టుబడులపై ఫోకస్ చేశారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తెస్తున్నారు. వాటి జోలికి పవన్ కళ్యాణ్ పోవడం లేదు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి సంబంధించి పవన్ కళ్యాణ్ పూర్తి స్వేచ్ఛ తో పనిచేస్తున్నారు. అటవీ శాఖతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై పవన్ తనదైన శైలిలో ముందుకు వెళుతున్నారు. అంటే కచ్చితంగా దీని వెనుక వ్యూహం ఉంటుంది. వ్యూహం ప్రకారమే ఆ ముగ్గురు నేతలు ముందుకెళ్తున్నారు. రాజకీయంగా అవసరమైన ప్రతిసారి పవన్ వచ్చి బయట మాట్లాడుతున్నారు. అందులో భాగంగా పెద్దిరెడ్డి లాంటి పెద్ద నేత విషయంలో పవన్ చెప్పేసరికి ప్రజల్లోకి వెళ్ళింది. అదే చంద్రబాబు చెబితే దశాబ్దాల వైరం వారి మధ్య ఉండడంతో కావాలనే చెప్పారని ప్రత్యర్థులు ఆరోపించేవారు.మరో 15 ఏళ్ల పాటు ఏపీలో కూటమి ప్రభుత్వం ఉంటుందని పవన్ కళ్యాణ్ పదేపదే చెబుతున్నారు. ఆ మాట వెనుక ఉన్న మర్మం ఏమిటో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెలియడం లేదు. 15 ఏళ్ల పాటు చంద్రబాబు సీఎం గా కొనసాగుతారా? లేకుంటే పవన్ పదవి చేపడతారా? అనేది తెలియక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్ఫ్యూజన్లో ఉంది. మరో విడత చంద్రబాబు పదవి చేపట్టేందుకు డోకా లేదు. ఆ తరువాత ఆయన ఆరోగ్యంతో పాటు వయసు సహకరిస్తుందా లేదా అన్నది ఒక అనుమానం. మరోవైపు పవన్ విషయంలో టిడిపి అనుకూల మీడియా వైఖరి సైతం మారడం లేదు. అలాగని పతాక స్థాయిలో ప్రచారం కల్పించడం లేదు. అసలు కూటమిలో ఏం జరుగుతుందని అనుమానం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెంటాడుతూనే ఉంది. ఆపై గుట్టు ఆ ముగ్గురు నేతల మధ్య ఉంది. అస్మదీయులకు ప్రయోగిస్తామంటే కుదరని పని కూడా. కూటమి వ్యూహం తెలియక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పడుతున్న బాధ అంతా ఇంతా కాదు కూడా. అయితే ప్రధానంగా డిప్యూటీ సీఎం పవన్ వ్యూహం తెలియక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు నిద్ర కూడా

# కృష్ణా జిల్లాలో స్క్రబ్ టైఫస్"

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

మూడేళ్ల క్రితం ఢిల్లీ, తమిళనాడులో కనిపించిన 'స్క్రబ్ టైఫస్ " అనే జ్వరాలు ఇప్పుడు కృష్ణా జిల్లాలో ముఖ్యంగా మచిలీపట్నం నుంచి వచ్చే రోగుల్లో నమోదు అవుతున్నాయని అంటున్నారు కొందరు డాక్టర్లు. చాలా కాలం హై ఫివర్, ప్లేట్ లెట్స్ పడిపోవడం వంటివి దీని లక్షణాలుగా వారు చెబుతున్నారు. ఈ వ్యాధి వచ్చిన వాళ్ళు వెంటనే సరైన వైద్యం తీసుకోకుంటే కొన్నిసార్లు ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉందని కృష్ణా జిల్లా నుంచి వస్తున్న కేసుల్లో ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయని విజయవాడకు చెందిన ఊపిరి హాస్పిటల్స్‌లో ఎండీగా పని చేస్తున్న ఆతీ. రఘు రామ్ ఒక వీడియోలో తెలిపారు. అయితే విజయవాడ నుంచి జ్వరంతో వచ్చిన వాళ్లలో ఈ వ్యాధి ఇంతవరకూ కనిపించలేదని ఆయన అన్నారు మట్టిలో ఉండే చిన్న నల్లిలాంటి క్రిమి కాటుతో ఈ వ్యాధి వస్తుంది. చాలా కాలం జ్వరం ఉండడం ప్లేట్లు లెట్స్ పడిపోవడంతో ఇది "డెంగీ " అని భ్రమ పడతారు. కానీ నిర్ణీత పరీక్షలతో ఈ వ్యాధి ని నిర్ధారించవచ్చని డాక్టర్స్ చెబుతున్నారు. అందుకే సాధారణ జ్వరం అని ఆలస్యం చేయకుండా లక్షణాలు కనిపించగానే డాక్టర్ వద్దకు వెళ్లాల్సిందిగా వారు ప్రజలకు సూచిస్తున్నారు. సాధారణంగా శీతాకాలంలో అక్కడక్కడా ఈ వ్యాధి కనిపిస్తుందని ఎక్కువగా కొండ ప్రాంతాల్లో కనిపించే ఈ పురుగు ఇప్పుడు సిటీల్లో సైతం కనిపించడం ఆందోళన కలిగిస్తుందని వైద్యులు అంటున్నారు. మట్టిలో కలిసిపోయే ఈ పురుగు కాటు వల్ల ప్లేట్ లెట్స్ పడిపోతాయని నిర్లక్ష్యం చేస్తే బాడీలో మల్టీపుల్ ఆర్గాన్స్ దెబ్బ తినే ప్రమాదం ఉందని డాక్టర్స్ అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ఈ వ్యాధి సోకితే అలాంటివారు రికవర్ కావడం కాస్త కష్టం అని డాక్టర్ రఘురామ్ అభిప్రాయపడ్డారు. ఇది అంతా ప్రజల్లో అవగాహన పెంచడం కోసమేననీ అయన అన్నారు.

వ్యాధి ప్రధాన లక్షణాలు1) ఎక్కువ కాలం జ్వరం2) విపరీతమైన ఒంటి నొప్పులు3) తలనొప్పి4) కొన్ని సార్లు తలనొప్పి5) ప్లేట్ లెట్స్ పడిపోవడం6)క్రియాటిన్ పెరగడం

ప్రస్తుతం శీతకాలం సీజన్ నడుస్తున్న నేపథ్యంలో ఒకటికి రెండు రోజులు జ్వరం గనక ఎక్కువగా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా డాక్టర్ వద్దకు వెళ్లాలని లోకల్ ఆర్ఎంపీ డాక్టర్లు లేదా సొంత వైద్యంపై ఎక్కువగా ఆధారపడద్దని ఎక్స్పర్టు చెబుతున్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచడం కోసం ప్రభుత్వం కూడా కృషి చేయాలి అనేది వారి సూచన.

# ర్యాపిడో డ్రైవర్ అకౌంట్లో 331 కోట్లు

రాంచీ, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

ర్యాపిడో బైక్ రైడర్ ఖాతాలో రూ.331 కోట్ల డిపాజిట్లను కేంద్ర దర్యాప్తు సంస్థఈడీకనుగొంది. యాప్ ఆధారిత అగ్రిగేటర్ రాపిడోలోని బైక్-టాక్సీ డ్రైవర్ ఖాతాలో కోట్ల విలువైన మనీలాండరింగ్ కేసు దర్యాప్తు సందర్భంగా ఈ డబ్బును ఈడీ కనుగొంది. వార్తా సంస్థ కేవలం ఎనిమిది నెలల్లోనే డ్రైవర్ బ్యాంకు ఖాతాలో రూ.331 కోట్లకు పైగా జమ అయినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గుర్తించింది. ఈ డబ్బు అక్రమ బెట్టింగ్ నెట్‌వర్క్‌తో ముడిపడి ఉందని భావిస్తున్నారు. 1లీఃవబి ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో డబ్బు జాడను ట్రాక్ చేస్తున్నప్పుడు రాపిడో డ్రైవర్ ఖాతా కనుగొన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ విషయానికి సంబంధించి రాపిడో నుండి ఎటువంటి స్పందన లేదు.ఆగస్టు 19, 2024- ఏప్రిల్ 16, 2025 మధ్య రాపిడో బైక్ టాక్సీ డ్రైవర్ బ్యాంకు ఖాతాలో రూ.331.36 కోట్లు జమ అయినట్లు ఈడీ చెబుతోంది. ఈ గణనీయమైన మొత్తాన్ని చూసిన ఈడీ బ్యాంకు రికార్డులలో చూపిన చిరునామాపై దాడి చేసింది. అక్కడ ఖాతా ఉన్న వ్యక్తి ఢిల్లీలోని ఒక చిన్న కాలనీలోని రెండు గదుల ఇంట్లో నివసిస్తున్నాడని, తన రోజువారీ అవసరాలను తీర్చుకోవడానికి రోజంతా బైక్ టాక్సీ నడుపుతున్నాడని ఈడీ కనుగొంది.

# నెంబర్ వన్‌గా జియో

ముంబై, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:




దేశీయ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో దూసుకుపోయింది. లక్షలాది మంది కొత్త కస్టమర్లను చేర్చుకుంది. అక్టోబర్ నెలలో జియోకు కొత్తగా 19.97 లక్షల మంది చేరినట్లు ట్రాయ్ వెల్లడించింది. దీంతో కంపెనీ మొబైల్ కస్టమర్లు 48.47 కోట్లకు చేరుకున్నారు. అలాగే ఎయిర్‌టెల్ వైర్‌లెస్ యూజర్లు 12.52 లక్షల మంది చేరడంతో మొత్తం సంఖ్య 39.36 కోట్లకు చేరుకున్నారు.ట్రాయ్ వివరాల ప్రకారం.. అంతకు ముందు నెలలో 39.24 లక్షల మంది ఉన్నారు. ఇక ప్రభుత్వరంగ టెలికాం సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు 9.25 కోట్లకు చేరారు. కానీ, వొడాఫోన్ ఐడియాకు మరోసారి భారీ షాక్ తగిలింది. గత నెలలోనూ కంపెనీ నెట్‌వర్క్ నుంచి 20.83 లక్షల మంది వెళ్లిపోయారు. దీంతో కంపెనీ మొబైల్ యూజర్లు 20 కోట్లకు పడిపోయినట్టు ట్రాయ్ తన నెలవారి సమీక్షలో వెల్లడించింది. మొత్తంమీద దేశీయంగా 123 కోట్ల మంది టెలిఫోన్ సబ్‌స్క్రైబర్లు ఉన్నట్టు ట్రాయ్ తెలిపింది.మొత్తం బ్రాడ్‌బ్యాండ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య సెప్టెంబర్ చివరి నాటికి 995.63 మిలియన్ల నుండి అక్టోబర్ చివరి నాటికి 999.81 మిలియన్లకు పెరిగింది. నెలవారీ వృద్ధి రేటు 0.42 శాతం. ఆర్జియో 50.84 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉండగా, భారతీ ఎయిర్‌టెల్ 31.26 శాతం,విఐ 12.72 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉన్నాయి.2025 సెప్టెంబర్ చివరి నాటికి 46.61 మిలియన్లుగా ఉన్న వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 2025 అక్టోబర్ చివరి నాటికి 46.75 మిలియన్లకు పెరిగింది. వైర్‌లైన్ సబ్‌స్క్రైబర్ బేస్‌లో నికర పెరుగుదల 0.14 మిలియన్లు, నెలవారీ వృద్ధి రేటు 0.30 శాతం. అక్టోబర్ 2025లో వైర్‌లైన్ మార్కెట్‌లో రిలయన్స్ జియో 30.75 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 22.86 శాతం, వొడాఫోన్ ఐడియా 1.74 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మూడు పిఎస్యూ యాక్సెస్ సర్వీస్ ప్రొవైడర్లు అయిన బీఎస్ఎన్ఎల్ , ఎంటీఎన్ఎల్, ంఖూఈఒ వైర్‌లైన్ మార్కెట్ వాటాలో 20.22% శాతం వాటాను కలిగి ఉన్నాయి.2025 సెప్టెంబర్ 1,182.32 నాటికి వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 1182.32 మిలియన్ల నుండి 2025 అక్టోబర్ చివరి నాటికి 1184.62 మిలియన్లకు పెరిగింది. తద్వారా నెలవారీ వృద్ధి రేటు 0.19 శాతంగా నమోదైంది. 2025 అక్టోబర్‌లో వైర్‌లైన్ మార్కెట్‌లో రిలయన్స్ జియో 41.36 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 33.59 శాతం, వొడాఫోన్ ఐడియా 17.13 శాతం వాటాను కలిగి ఉన్నాయి. రెండు పిఎస్యూ యాక్సెస్ సర్వీస్ ప్రొవైడర్లు అయిన బీఎస్ఎన్ఎల్,ఎంటీఎన్ఎల్ మార్కెట్ వాటా కేవలం 7.92 శాతం మాత్రమే.

## నేడు ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

కంప్యూటర్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాల గురించి అవగాహన పెంచడం ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. దిల్లీకి చెందిన రాజేంద్ర ఎస్.పవార్, విజయ్ కె.తడని లు ఐఐటి ఢిల్లీ లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 1981 లోనే రానున్న కాలంలో కంప్యూటర్లే ప్రపంచాన్ని శాసిస్తాయనే విషయాన్ని గుర్తించి...కంప్యూటర్ వినియోగం నేర్పించేందుకు ఎన్ఐఐటి (నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) అనే సంస్థను నెలకొల్పారు. 1981 డిసెంబర్ 2న ఢిల్లీలోనే మొదటి శాఖను ప్రారంభించారు.దీని ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ నివ్వటం ప్రారంభించారు. 2000 నాటికి ప్రపంచంలోని 40 దేశాల్లో రెండు వేల శాఖలు విస్తరించారు. 2001లో ఎన్ఐఐటి తన 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవాన్ని ప్రారంభించింది.ఈ క్రమంలో 2001 డిసెంబరు 2న ఒకే రోజు ప్రపంచ వ్యాప్తంగా లక్ష మందికి కంప్యూటర్ శిక్షణనిచ్చారు. అదే రోజును ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవంగా ప్రపంచం గుర్తించింది. ఇతర అంశాలు: దేశంలో 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాదించిన తొలి గ్రామం - చామ్రవట్టం (కేరళ). భారత దేశంలో కంప్యూటర్ అక్షరాస్యత కేవలం 6.5%. అందరికి కంప్యూటర్ విద్య అందించాలనే లక్ష్యంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2002లో ప్రభుత్వ బడుల్లో కంప్యూటర్ శిక్షణను ప్రవేశ పెట్టింది. 2008 నుంచి కంప్యూటర్ విద్యను ఎన్ఐఐటి ద్వారా పూర్తిగా ఆధునీకరించింది.

# ఇక పెరిగేది ఎప్పుడూ...

విశాఖపట్టణం,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

దేశంలో బీజేపీకి బలమైన నాయకత్వం ఉంది. మోదీ, అమిత్ షా వంటి వారు ఎప్పటికప్పుడు రాజకీయ వ్యూహాలను రచించుకుంటూ పార్టీని అన్ని రాష్ట్రాల్లో గెలుపు దిశగా తీసుకెళుతున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్ మాత్రం మోదీ, అమిత్ షా చేతుల్లో లేదని వారికీ అర్థమయింది. ఇక్కడ రాష్ట్ర స్థాయి నేతలు ఎవరూ పెద్దగా పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం చేసేందుకు ప్రయత్నించరు. గత కొన్ని దశాబ్దాల నుంచి బీజేపీకి ఏపీలో పట్టు లేదు. ఒంటరిగా పోటీ చేస్తే సింగిల్ డిజిట్ ఓటింగ్ శాతానికి మాత్రమే పరిమితమవుతుంది. అందుకే టీడీపీ, జనసేన అండతోనే పార్లమెంటు స్థానాలయినా, అసెంబ్లీ సీట్లయినా గెలిచింది. బీజేపీ నేతలు తమ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు ఇప్పటి నుంచి కాదు ఎప్పటి నుంచో వినిపిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కానీ, విభజన తర్వాత కానీ బీజేపీ ఏపీలో ఏదైనా బలపడిందా? అంటే లేదనే సమాధానమే వస్తుంది. పోనీ నాయకత్వం సరైనది లేదా? అంటే ఎందుకు లేరు.. ముప్పవరపు వెంకయ్య నాయుడు నుంచి కంభపాటి హరిబాబు, సోము వీర్రాజు, పురంద్రీశ్వరి.. నేడు మాధవ్ ఇలా రాజకీయాల్లో పట్టున్న వారే. కొంత జనాకర్షణ కలిగిన నేతలే. సామాజికవర్గం అండగా ఉన్న లీడర్లే. కానీ ఏ నియోజకవర్గంలోనూ ఒంటరిగా గెలిచేటంతగా పార్టీని తీసుకెళ్లలేకపోవడానికి కారణాలపై ఇంత వరకూ కమలం పార్టీలో అంతర్మథనం జరగలేదు. పొరుగున ఉన్న తెలంగాణలో ఒంటరిగా బీజేపీ బలపడుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ లో మాత్రం ఇంత వరకూ ఒక్క పర్సెంట్ కూడా ఎదగలేదన్నది యదార్థం. దీనిపై కేంద్ర నాయకత్వం కూడా ఒకింత సీరియస్ గానే ఉందని తెలిసింది. కేంద్ర మంత్రి పదవులు, రాష్ట్రంలో మంత్రి పదవులు, గవర్నర్ గిరీ కట్టపెట్టినా ఏ మాత్రం ఫలితం ఎందుకు ఉండలేదని జాతీయ స్థాయి నాయకత్వంలో చర్చ ప్రారంభమయినట్లు తెలిసింది. ఎప్పటికీ ఇతరులపై ఆధారపడి ఎన్నేళ్లు రాజకీయాలు చేయాలన్న అసహనం కూడా అగ్రనాయకత్వం వ్యక్తం చేస్తున్నట్లు కనపడుతుంది. అందుకే బీజేపీ కేంద్ర నాయకత్వం ఏపీని తమ జాబితా నుంచి తొలగించినట్లేనని భావిస్తుంది. అలాగని పార్టీని పూర్తిగా వదిలేయడం మంచిది కాదని, త్వరలోనే కేంద్ర నాయకత్వం రాష్ట్ర నాయకులను పిలిచి క్లాస్ పీకే అవకాశాలు కూడా లేకపోలేదన్నది హస్తిన వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. మరి ఇప్పటికైనా బీజేపీ రాష్ట్ర నాయకత్వంలో కదలిక వస్తుందా? లేదా? అన్నది చూడాలి.

# బంగారం నిల్వల్లో భారత్ 8వ స్థానం

ముంబై, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:



పంచవ్యాప్తంగా బంగారం రేట్లు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ఎవరూ ఊహించని విధంగా ఆకాన్నంటుతున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక పరిణామాలు, ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలతో గోల్డ్ రేటుకు బ్రేకులు పడటం లేదు. దాదాపు తులం బంగారం లక్షన్నరకు చేరుకోగా.. రానున్న కొద్ది నెలల్లో రూ.2 లక్షలకు కూడా ఎగబాకే అవకాశముందని బిజినెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల వల్ల గోల్డ్‌పై పెట్టుబడి పెట్టేందుకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గోల్డ్ రేట్ భారీగా పెరగడానికి ఇదొక కారణంగా తెలుస్తోంది. అన్ని దేశాలు కూడా ద్రవ్యోల్బణం, కరెన్సీని రక్షించుకోవడానికి తమ వద్ద గోల్డ్ నిల్వలను పెంచుకుంటున్నాయి. ప్రపంచ గోల్డ్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన నివేదిక దీనిక బలం చేకూర్చుతోంది.ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ నిల్వల్లో అమెరికా తొలి స్థానంలో ఉంది. 2000వ సంవత్సరం నుంచి ఆ దేశంలో గోల్డ్ నిల్వలు స్థిరంగా ఉన్నాయి. ప్రస్తుతం సగటును 8,134 టన్నులు ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.ఇక గోల్డ్ నిల్వల్లో జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా తర్వాత జర్మనీ దగ్గర ఎక్కువ బంగారు నిల్వలు ఉన్నాయి. దాదాపు ఆ దేశం దగ్గర 3,350.25 టన్నుల నిల్వలు ఉన్నాయి. గత త్రైమాసికం కంటే ఈ సారి నిల్వలు కొంచెం తగ్గాయి. ఇక ఇటలీ దగ్గర కొన్ని దశాబ్దాలుగా నిల్వలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 2,451.84 టన్నులుగా ఉంది. 2000, 2003, 2025 నుంచి ఇదే సంఖ్య నమోదవుతూ వస్తోంది.ఇక తర్వాతి స్థానంలో ఫ్రాన్స్ ఉంది. ఫ్రాన్స్ దగ్గర ప్రస్తుతం 2,437 టన్నుల నిల్వ ఉంది. ఇక రష్యా దగ్గర (2,329.63 టన్నులు), చైనా దగ్గర (2,279.6 టన్నులు), స్విట్జర్లాండ్ దగ్గర (1,040 టన్నులు) నిల్వల ఉన్నాయి.ఇక ఇండియా దగ్గర ప్రస్తుతం 800 టన్నుల గోల్డ్ నిల్వ ఉంది. గత త్రైమాసికం కంటే నిల్వలు కాసత్ పెరిగాయి. 2000–2025 వరకు నిల్వలు సగటున 531 టన్నులుగా ఉన్నాయి. 2001లో అత్యల్ప స్థాయిలో నమోదైంది.

==============

# ఎవరికి ఎర్త్... ఎవరికి బెర్త్...

## కేబినెట్ లో మార్పులు

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

తెలంగాణలో కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి రెండేళ్లు కావస్తోంది. కానీ పూర్తి స్థాయి క్యాబినెట్ మాత్రం కొలువు తీరలేదు. అయితే, మంత్రివర్గ పూర్తి స్థాయి విస్తరణ దిశగా కాంగ్రెస్ సర్కార్ అడుగులు వేస్తోంది. డిసెంబర్ తొలి వారంలోనే మరో రెండు మంత్రి పదవులను భర్తీ చేయడంతో పాటు, ప్రస్తుత మంత్రుల్లో కొందరికి ఉద్వాసన పలికి, మరికొందరికి అమాత్యుల పట్టం కట్టవచ్చని హస్తం ముఖ్య నేతలు చెబుతున్నారు. అయితే, అమాత్యులుగా ఎవరు 'ఇన్', ఎవరు 'ఔట్' అన్న ఉత్కంఠ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో నెలకొంది. మంత్రుల శాఖల్లోనూ మార్పు ఉంటుందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో విస్తృతంగా సాగుతోంది.జూబ్లీ హిల్స్ ఉపఎన్నిక సందర్భంలో కాంగ్రెస్ హైకమాండ్ మైనార్టీ కోటాలో మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి కట్టబెట్టింది. గత కొన్నాళ్లుగా మైనార్టీ వర్గానికి మంత్రి పదవి దక్కలేదన్న చర్చకు అజారుద్దీన్ ద్వారా ఫుల్ స్టాప్ పెట్టింది. దీంతో ప్రస్తుతం తెలంగాణ మంత్రుల సంఖ్య 16కు చేరింది. చట్ట ప్రకారం 18 మంది మంత్రులుగా పదవీ స్వీకారం చేయాల్సి ఉంది. మరో రెండు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. మిగిలి ఉన్న ఈ రెండు స్థానాలను భర్తీ చేయడం ద్వారా అన్ని వర్గాలను, ప్రాంతాలను సంతృప్తి పరచాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. సామాజిక న్యాయ సూత్రాన్ని అనుసరించి ఈ రెండు బెర్తులను ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ లేదా బీసీ వర్గాలలోని కీలకమైన ఉపవర్గాలకు కేటాయించే అవకాశం ఉందని కాంగ్రెస్ ముఖ్య నేతలు చెబుతున్నారు. అయితే, ఈ బెర్తులు దక్కించుకోవడానికి సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.పీసీసీ చీఫ్ బి. మహేష్ కుమార్ గౌడ్, ఆది శ్రీనివాస్, విజయశాంతి వంటి కీలక నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిలో ఒక మహిళకు అవకాశం ఇవ్వాలనే అంశాన్ని కూడా అధిష్టానం పరిశీలిస్తోందని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విస్తరణ కేవలం రాజకీయంగానే కాకుండా, రాష్ట్ర పరిపాలనను మరింత చురుకుగా మార్చడానికి అనుభవం ఉన్నవారిని ఎంచుకోవడంపై కూడా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు స్థానాల భర్తీయే కాకుండా, కొందరు మంత్రుల శాఖలను మార్చే అవకాశం ఉందన్న చర్చ ప్రస్తుతం హాట్ హాట్‌గా సాగుతోంది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రుల పని తీరుపై సీఎం రేవంత్ రెడ్డితో పాటు హైకమాండ్ సమీక్ష చేసినట్లు సమాచారం. ఆశించిన స్థాయిలో



పని తీరు కనపర్చని మంత్రులకు ఉద్వాసన పలుకుతారన్న చర్చ సాగుతోంది. మరో మూడేళ్ల పాటు పాలనను పరుగులెత్తించాలన్న ఉద్దేశంతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, అందుకు అనుగుణంగా మంత్రులుగా సమర్థులైన వారికి అవకాశం ఇవ్వాలన్న యోచనలో ఉన్నట్లు చెబుతున్నారుశాఖల మార్పులు కూడా ఉంటాయన్నది హస్తం నేతల మాట. ఇప్పటికే విద్య, మున్సిపల్, హోం వంటి ముఖ్యమైన శాఖలు సీఎం చెంతనే ఉన్నాయి. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న వారి శాఖలను మార్చే అవకాశం లేకపోలేదన్న చర్చ నడుస్తోంది. మంత్రి శ్రీధర్ బాబుకు హోం మంత్రిగా అవకాశం ఇవ్వవచ్చన్న ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.

ఎవరిపై వేటు? ఎవరికి అవకాశం?

అయితే, ప్రస్తుతం ఎవరికి అవకాశం ఇస్తారు, ఎవరికి క్యాబినెట్ నుంచి ఉద్వాసన చెబుతారన్న దానిపై పూర్తి స్పష్టత లేకున్నా, పార్టీలో మాత్రం కొందరి పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కొండా సురేఖను తప్పించి, ఆమె స్థానంలో బీసీ మహిళ కోటాలో విజయశాంతికి అవకాశం కల్పిస్తారన్న ప్రచారం సాగుతోంది. ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటారని తెలుస్తోంది. తద్వారా తన సన్నిహితుడికి అవకాశం కల్పించడమే కాకుండా, బీసీలకు ప్రాముఖ్యత ఇచ్చినట్లుంటుందన్న చర్చ సాగుతోంది. ఇక సీఎంతో నేరుగా తలపడిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఉద్వాసన తప్పదన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో సాగుతోంది. ఆయన స్థానంలో మరో బలమైన సామాజిక వర్గం నుంచి అవకాశం ఇస్తారని చెబుతున్నారు. మల్ రెడ్డి రంగారెడ్డికి అవకాశం ఉందన్న ప్రచారం ఉంది.ఇక కోమటి రెడ్డి వెంకటరెడ్డిని తొలగించి ఆయన స్థానంలో కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డికి అవకాశం ఇవ్వవచ్చన్న చర్చ నడుస్తోంది. గత కొంత కాలంగా రాజగోపాల్ రెడ్డి పార్టీపై అసంతృప్తి వెళ్లగక్కుతున్న విషయం తెలిసిందే. తనకు మంత్రి పదవి ఇస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారని, మాట నిలబెట్టుకోలేదని విమర్శలు చేస్తున్నారు. ఈ టైంలో 'కుటుంబానికి ఒకే పదవి' అన్న పార్టీ లైన్ ప్రకారం కోమటి రెడ్డి వెంకటరెడ్డిని తొలగించి, ఆయన సోదరుడు రాజ్ గోపాల్ రెడ్డికి అవకాశం దక్కవచ్చని తెలుస్తోంది. తద్వారా ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామన్న పేరు వస్తుందన్న ఆలోచనలో హై కమాండ్ ఉన్నట్లు సమాచారం.మంత్రి విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ ఈ డిసెంబర్ మొదటి వారం లేదా జనవరిలో పూర్తిస్థాయి కేబినెట్ కొలువుదీరే అవకాశం ఉంది. ఈ నిర్ణయాలు కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్తు రాజకీయ వ్యూహానికి, పరిపాలనా సామర్థ్యానికి ప్రతీకగా నిలవనున్నట్లు హస్తం నేతలు చెబుతున్నారు.

# నేడు జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే అంటే జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం అన్నమాట. ప్రతీ ఏడాది డిసెంబర్ 2 వ తేదీన ఈ నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే జరుపుకుంటారు. ఈ ఏడాది జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవానికి ఉన్న ప్రత్యేకత, ప్రాధాన్యత, చరిత్ర నేపథ్యం ఏంటో ఒకసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. భోపాల్ గ్యాస్ దుర్ఘటన గురించి అందరికీ తెలిసిందే. 1984లో డిసెంబర్ 2, 3 తేదీల్లో రాత్రి జరిగిన ఈ ఘోర దుర్ఘటనలో చనిపోయిన వారిని స్మరించుకుంటూ ప్రతీ ఏడాది అదే తేదీ అయిన డిసెంబర్ 2 న జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కెమికల్ ఫ్యాక్టరీ నుంచి మిథైల్ ఐసోసైనేట్ అనే విష రసాయనాలు లీకైన కారణంగా ఈ ఘటన చోటుచేసుకుంది.

జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం లక్ష్యం:ప్రతీ ఏడాది కాలుష్యంతో ప్రపంచ మానవాళికి జరిగే నష్టాన్ని తెలియజెప్పేందుకే నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డేను నిర్వహిస్తున్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించడం వెనుకున్న మరో లక్ష్యం ఏంటంటే.. పౌరులు కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాడేలా వారికి అవగాహన కల్పించడమే. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవానికి ముందుగా సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కాలుష్యంపై పలు గణాంకాలు విడుదల చేసింది. ఈ ఏడాది నవంబర్‌లో ఢిల్లీలో జరిగినంత గాలి కలుషితం గత ఏడు సంవత్సరాల్లో ఎన్నడూ జరగలేదని జాతీయ కాలుష్య నివారణ మండలి పేర్కొంది.

## వైన్ షాపు వద్దంటూ అందోళన

ఖమ్మం భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

నగరంలోని ముస్తఫా నగర్ వైన్ షాప్ ముందు స్థానికులు ఆందోళనకు దిగారు. వైన్ షాప్ బంద్ చేపించి, షాప్ ముందు బైఠాయించారు. జనావాసాల మధ్య వైన్ షాపును తొలగించాలని డిమాండ్ చేసారు. స్థానికులకు బీఆర్ఎస్ కార్పొరేటర్ పల్లా రోజ్ లీనా, కాంగ్రెస్, టిడిపి పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే ప్రదేశంలో వైన్ షాప్ ఏర్పాటు చేయొద్దని అధికారులు,ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లామంటున్నారు. అర్ధరాత్రి వరకు వైన్ షాపు తెరిచి ఉండటం వల్ల మహిళలు, విద్యార్థులకు ఇబ్బందులతో పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందంటున్నారు. షాపును జనావాసాల మధ్య నుంచి తొలగించే వరకు ప్రతిరోజు ఆందోళన చేస్తామని హెచ్చరించారరర.

# తెలంగాణలో మరో కొత్త రైల్వే స్టేషన్

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

మల్కాజ్‌గిరి పరిధిలోని రాధాకృష్ణ నగర్ (ఆర్కే నగర్) కాలనీ పేరును నూతన రైల్వే స్టేషన్‌కు పెట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కృషి ఫలితంగా ఇది సాధ్యమైంది. ఈ స్టేషన్‌ను చర్లపల్లి–బొల్లారం మార్గంలో దయానంద్‌నగర్ స్టేషన్‌తో పాటు అమృత్ భారత్ పథకం కింద నిర్మిస్తున్నారు. ఈ స్టేషన్ అందుబాటులోకి వచ్చాక.. ఇక్కడ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ఆపడానికి ప్లాట్‌ఫామ్‌ను విస్తరిస్తున్నారు. ప్రయాణికులు అదనంగా ఓఓూ రైళ్లు, ఇతర ఎక్స్‌ప్రెస్‌లు, అలాగే ఆర్టీసీ బస్సు సర్వీసుల కోసం విజ్ఞప్తి చేస్తున్నారు.మల్కాజ్‌గిరి సర్కిల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్‌కు తమ కాలనీ పేరును పెట్టడంపై రాధాకృష్ణ నగర్ (ఆర్కే నగర్) కాలనీ ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కాలనీ పేరునే రైల్వే స్టేషన్‌కు ఖరారు చేయడం తమకు గర్వకారణమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రైల్వే మరియు రాష్ట్ర ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకొని ముందుకు సాగడం.. అలాగే కాలనీ సభ్యుల సహకారంతోనే ఆర్కే నగర్ పేరు పెట్టడం సాధ్యమైందని వివరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ పాల్గొన్నారు.హైదరాబాద్ నగరంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి, ఇతర ప్రాంతాలకు రైలు కనెక్టివిటీని పెంచడానికి అనేక రైల్వే స్టేషన్లు కృషి చేస్తున్నాయి. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ వంటి రద్దీ స్టేషన్లతో పాటు.. ఇటీవల రూ. 450 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ కూడా అందుబాటులోకి వచ్చింది. వీటితో పాటు లింగంపల్లి, బేగంపేట, మల్కాజిగిరి స్టేషన్ల నుంచి కూడా రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి.తాజాగా.. నగరంలో రెండు కొత్త రైల్వే స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ స్టేషన్లు చర్లపల్లి – మౌలాలి – బొల్లారం మార్గంలో ఆర్కేనగర్ మరియు దయానంద్‌నగర్ వద్ద నిర్మిస్తున్నారు. ఈ రెండు స్టేషన్లలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిర్మాణ పనులను ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఆర్కేనగర్ స్టేషన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత.. ఇక్కడ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌ను ఆపేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీని కోసం 21 కోచ్‌లకు సరిపడా ప్లాట్‌ఫామ్‌ను విస్తరిస్తున్నారు. ఆర్కేనగర్ స్టేషన్‌లో అదనంగా ఆదిలాబాద్–తిరుపతి, విశాఖపట్నం–నాందేడ్, నర్సాపూర్–నాగర్‌సోల్, విశాఖపట్నం–షిర్డీ సాయినగర్, నాగావళి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లను కూడా ఆపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కొత్త రైల్వే స్టేషన్ల ప్రారంభం.. అదనపు రైళ్ల సౌకర్యాలు స్థానిక ప్రాంతాల ప్రయాణికులకు రవాణా సౌకర్యాన్ని, కనెక్టివిటీని గణనీయంగా పెంచే అవకాశం ఉంది.

హుస్నాబాద్ అభివృద్ధికి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి..

హుస్నాబాద్ నియోజకవర్గాన్ని 'ఉత్తర తెలంగాణ కోనసీమ'గా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. డిసెంబర్ 3న సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యే బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన ఆయన.. ఈ సందర్భంగా పలు కీలక ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. వీటిలో రింగురోడ్డు నిర్మాణం, స్టేడియం అభివృద్ధి, కబడ్డీ అకాడమీ ఏర్పాటు ప్రధానమైనవి. అలాగే ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు బస్సులు, విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ప్రాంతంగా.. ఉత్తర తెలంగాణ కోనసీమగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. డిసెంబర్ 3వ తేదీన హుస్నాబాద్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో.. మంత్రి పొన్నం ప్రభాకర్ సభా స్థలిని పరిశీలించి.. అధికారులకు ఏర్పాట్లపై పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన.. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారుసీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అంతేకాకుండా.. హుస్నాబాద్ సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన పలు ముఖ్యమైన ప్రాజెక్టులను సీఎం ముందు ఉంచనున్నట్లు పేర్కొన్నారు. దీనిలో ముఖ్యంగా.. హుస్నాబాద్‌లో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు రింగురోడ్డు నిర్మాణం, పట్టణ ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా తాగునీటి సౌకర్యం మెరుగుదలపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చిస్తామని మంత్రి తెలిపారు. నియోజకవర్గ యువతను ప్రోత్సహించేందుకు స్టేడియం అభివృద్ధి, కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు.పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం డిగ్రీ కాలేజీ సమీపంలోని స్థలంలో పార్క్‌ను, అలాగే మార్కెట్ యార్డ్, కాటన్ మార్కెట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రిని కోరనున్నారు. సీఎం పర్యటన సందర్భంగా కొన్ని సంక్షేమ పథకాల అమలును కూడా మంత్రి వెల్లడించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు ప్రత్యేకంగా బస్సులను పంపిణీ చేయనున్నారు. ఇది మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడుతుంది. పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో వారికి సైకిళ్లను పంపిణీ చేస్తామన్నారు. హైదరాబాద్ నుంచి హుస్నాబాద్‌కు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ఎక్స్‌ప్రెస్ బస్సుల సేవలను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి ప్రకటించారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# రసాయన శాస్త్రంలో పనస మహేష్‌కు పీహెచ్డీ

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1 :

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి పనస మహేష్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'కార్బాక్సమైడ్, సల్ఫోనామైడ్ ఉత్పన్నాల సంశ్లేషణ, లక్షణం, యాంటీప్రొలిఫెరేటివ్, సైటోటాక్సిక్ కార్యకలాపాల మూల్యాంకనం'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ మహేష్ క్యాన్సర్ పరిశోధనలో అంతర్లీనంగా ఉన్న కీలక సవాళ్లను, ముఖ్యంగా క్యాన్సర్ రకాలలో దాని సంక్లిష్టత, వైవిధ్యాన్ని పరిష్కరించడంపై



దృష్టి సారించినట్టు తెలియజేశారు. తేలికపాటి ప్రతిచర్య పరిస్థితులలో వాణిజ్యపరంగా లభించే రసాయనాలను ఉపయోగించి నూతన 1-ఫినైల్ సైక్లోప్రొపేన్ కార్బాక్సమైడ్ ఉత్పన్నాలు, పైరజోల్-4-సల్ఫోనామైడ్ ఉత్పన్నాలను ఉత్పత్తి చేయడానికి లీనియర్ సింథటిక్ వ్యూహాన్ని అభివృద్ధి చేసినట్టు వివరించారు. ఈ సమ్మేళనాలను అధునాతన విశ్లేషణాత్మక పద్ధతులను ఉపయోగించి పూర్తిగా వర్గీకరించారన్నారు. సెల్ టైటర్-గ్లో లుమినిసెంట్ ఎబిలిబిలిటీ అస్సేను ఉపయోగించి యూ937 హ్యూమన్ మైలోయిడ్ లుకేమియా కణాలపై వాటి యాంటీప్రొలిఫెరేటివ్, సైటోటాక్సిక్ కార్యకలాపాల కోసం సంశ్లేషణ ఉత్పన్నాలను మూల్యాంకనం చేసినట్టు తెలిపారు. మైటోమైసిన్-సి సానుకూల నియంత్రణగా పనిచేస్తోందన్నారు. సమ్మేళనాలు విషపూరితం కాకుండా గణనీయమైన యాంటీప్రొలిఫెరేటివ్ కార్యకలాపాలను ఈ ఫలితాలు చూపించాయని, క్యాన్సర్ సంబంధిత అనువర్తనాలలో మరింత అన్వేషణకు వాటి సామర్థ్యాన్ని ప్రదర్శించినట్టు పేర్కొన్నారు. డాక్టర్ మహేష్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# భారం కానున్న విలీనం

హైదరాబాదభారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల చాలా కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ అభివృద్ధిపై దృష్టి పెట్టిన రేవంత్ సర్కార్.. తాజాగా నవంబర్ 25న నిర్వహించిన కేబినెట్ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ సమీపంలోని మున్సిపాలిటీలు, గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. అయితే దీనిపై ప్రజలలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెజారిటీ సానుకూలంగా ఉన్నా, ఆస్తి పన్ను పెరుగుదల, నిధి ఉపయోగం గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

మణికొండ, నార్సింగి వంటి ప్రాంతాలు ఆస్తి పన్నుల ద్వారా బలమైన ఆదాయం సంపాదిస్తున్నాయి, అయితే జవహర్‌నగర్, జల్పల్లి, తుక్కుగూడలో ఆర్థిక సమస్యలు ఉన్నాయి. విలీనం తర్వాత మొత్తం నిధులను ఎలా పంపిణీ చేస్తారో అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్థానిక అవసరాలకు ముందుతీసుకునేలా హామీ ఇవ్వాలని కోరుకుంటున్నారు. నగరానికి సమీపంలో ఉన్న వందల గ్రామాలను చేర్చినా, వాటి గ్రామీణ లక్షణాలను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలి. ప్రాంతాలవారీగా జనసాంద్రత భిన్నంగా ఉండడంతో మణికొండ, నార్సింగి వంటి దట్ట ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పెద్దఅంబర్‌పేట్, ఘట్కేసర్ ప్రాంతాల్లో తక్కువ జనాభాకు సరిపడా వనరులు కేటాయించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇక జీహెచ్ఎంసీ డివిజన్ల పునర్విభజన రాజకీయ, సామాజిక ఘర్షణలకు దారితీయవచ్చు. ఇవి సమర్థవంతంగా పరిష్కరించకపోతే విలీన ప్రక్రియ సమస్యలకు దారితీస్తుంది. సమతుల్య పరిపాలన కోసం అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. ప్రజలు ప్రయోజనాలను ఆశిస్తూ, స్థానిక అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చేలా పారదర్శకత కావాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక అమలు చేస్తే బృహత్తర అభివృద్ధి సాధ్యమవుతుంది.

మరి వాటి సంగతేంటీ

ఒకప్పుడు హైదరాబాద్ ఒక స్థాయి వరకు ఉండేది. ఎప్పుడైతే ఔటర్ రింగ్ రోడ్డు అనేది అందుబాటులోకి వచ్చిందో.. అప్పుడే హైదరాబాదు రూపు రేఖలు మారిపోయాయి. కొత్త హైదరాబాద్ పుట్టుకొచ్చింది. శివారు ప్రాంతాలు విపరీతంగా అభివృద్ధి చెందడంతో హైదరాబాద్ నగరం మహానగరంగా విస్తరించింది. అప్పట్లో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పలు ప్రాంతాలను మునిసిపాలిటీలుగా రూపొందించారు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను మరింతగా విస్తరించే కార్యక్రమానికి రూపకల్పన చేసిందిహైదరాబాద్ నగర పరిధిలో ఉన్న పురపాలకాలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సంస్థలో కలిపేసింది.. ప్రభుత్వ నిర్ణయంతో ఇన్ని రోజులపాటు పురపాలకాల పరిధిలో ఉన్న ప్రజలలో ఇప్పుడు సరికొత్త చర్చ మొదలైంది. వారికి లభించే ప్రయోజనాలు, ఎదురయ్యే నష్టాల గురించి చర్చించుకుంటున్నారు. హైదరాబాద్ పరిధిలో పురపాలకాలను విలీనం చేసిన క్రమంలో ఆస్తి పన్ను పెరుగుతుందా? చెల్లించే పనులు ఇతర ప్రాంతాలలో ఖర్చు చేస్తారా? అభివృద్ధి అనేది స్థిరంగా సాగుతుందా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. ఉదాహరణకు ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న మణికొండ, నార్సింగి నగరపాలక సంస్థలకు ఆస్తి పన్ను విపరీతంగా వస్తుంది. తుక్కుగూడ, జల్ పల్లి, జవహర్ నగర్ ప్రాంతాలు సరైన ఆదాయం లేకుండా ఇబ్బంది పడుతున్నాయి. వీటన్నిటిని హైదరాబాదులో కలిపితే నిధులు ఎలా ఖర్చు చేస్తారు? అనే ప్రశ్న ప్రజల్లో వ్యక్తం అవుతుంది. హైదరాబాద్ నగరానికి దగ్గరగా ఉన్న గ్రామాలు ఇకపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం అవుతాయి.. వాటిని నగర అభివృద్ధిలో భాగస్వామ్యం ఎలా చేస్తారు? ఒకవేళ చేస్తే ఏం పద్ధతి పాటిస్తారు? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. గ్రామీణ వాతావరణం పట్టణ వాతావరణంతో పోల్చి చూస్తే భిన్నంగా ఉంటుంది. అలాంటప్పుడు విలీన గ్రామాలలో అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళిక ఉండాలి. హైదరాబాద్ నగరం అతి పెద్దది అయినప్పటికీ.. ప్రాంతాల ఆధారంగా జనసాంద్రత ఉంటుంది. ఉదాహరణకు పెద్ద అంబర్పేట్, తుక్కుగూడ, ఘట్కేసర్ ప్రాంతంలో జనసాంద్రత తక్కువగా ఉంటుంది. నార్సింగి, మణికొండ ప్రాంతాలలో జనసాంద్రత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి అప్పుడు ఈ ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేస్తున్నప్పుడు అధికారులు జనాభాను, ఇతర విషయాలను లెక్కలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పునర్విభజన గతంలోనే అనేక అలజడులను సృష్టించింది. త్వరలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో కచ్చితంగా డివిజన్ల పునర్విభజన చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు అధికారులు ఎలాంటి విధానాన్ని పాటిస్తారు.. వివాదాలు లేకుండా ఎలా పరిష్కరిస్తారు.. అనేక ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది. మహా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆలోచన గొప్పగానే ఉన్నప్పటికీ.. దాని ఆచరణ సాధ్యమైతేనే ఆ నిర్ణయానికి సార్థకత లభిస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు.

# పవన్‌కు దొరకని సపోర్ట్...

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

రాజకీయాలు అన్నాక విమర్శలు ఉంటాయి. ప్రతి విమర్శలు సైతం ఉంటాయి. అయితే ఆ విమర్శలు హుందాగా ఉండాలే కానీ? వ్యక్తిత్వ హననానికి దిగేలా ఉండకూడదు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పైఇప్పుడు తెలంగాణ నేతలు అలానే మాట్లాడుతున్నారు. బిఆర్ఎస్ కు చెందిన జగదీశ్వర్ రెడ్డి అయితే శృతిమించి విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ కు బుర్ర లేదంటూ మాట్లాడారు. కోనసీమకు తెలంగాణ దిష్టి తగిలిందని పవన్ వ్యాఖ్యానించడం తప్పు అయ్యింది వారి దృష్టిలో. మొన్న మధ్యన పవన్ రాజోలు పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉప్పునీటితో కొబ్బరి పంట నాశనం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ పవన్ దృష్టికి రైతులకు తీసుకెళ్లారు. తెలుగు రాష్ట్రాల్లో కోనసీమ అందమైన ప్రాంతమని.. అటువంటిది తెలంగాణలో లేకపోవడం అక్కడి ప్రజలు బాధపడుతుంటారని.. వారి దిష్టి తగిలిందేమోనని పవన్ వ్యాఖ్యానించారు. కేవలం సానుకూల దృక్పథంతో చేసిన ఈ వ్యాఖ్య పై తెలంగాణ నేతలు విమర్శల పర్వానికి దిగుతున్నారు. అయితే ఇప్పుడు తెలంగాణనుంచి పవన్ కళ్యాణ్ పై ఒత్తిడి పెరుగుతోంది అక్కడి నేతల నుంచి. తెలంగాణ విషయంలో తప్పుడు వ్యాఖ్యలు చేసినందుకు పవన్ క్షమాపణలు చెప్పాలన్నది వారి డిమాండ్. అలా అయితే కెసిఆర్ వందలసార్లు క్షమాపణ చెప్పాలి ఏపీ ప్రజలకు. ఆయన ఏపీ నేతలను దూషించారు.. ఏపీ ప్రజలను చాలా చులకన చేసి మాట్లాడారు. కేటీఆర్ కూడా తక్కువ తినలేదు. చాలాసార్లు ఆయన ఏపీతోపాటు ఏపీ ప్రజలపై కూడా విమర్శలు చేశారు. చంద్రబాబు అరెస్ట్ సమయంలో హైదరాబాద్లో ఆందోళనలు అవసరం లేదని కూడా తేల్చి చెప్పారు. మరి హరీష్ రావు గురించి చెప్పనవసరం లేదు. ఆంధ్ర నేతలతో పాటు ప్రజలను తిడితేనే సెంటిమెంట్ పండుతుందని భావించిన ఆ ముగ్గురు నేతలతో పాటు ఆ పార్టీ నేతలు ఏపీని ఎంతలా తూలనాడారో తెలియనిది కాదు. ఈ లెక్కన వారు ఎన్నిసార్లు క్షమాపణ చెప్పాలి? తెలంగాణతో పోల్చుకుంటే ఏపీలో ఆ పరిస్థితి లేదు. ప్రత్యేక రాష్ట్ర సెంటిమెంట్ రగిలిస్తేనే తమకు మనుగడ అని అక్కడ రాజకీయ పార్టీల నేతలు గుర్తించారు. కానీ ఏపీ రాష్ట్రానికి చెందిన ఒక డిప్యూటీ సీఎం పైనే తెలంగాణ నేతలు విమర్శలు చేస్తుంటే.. ఏపీ నుంచి ఒక్కరంటే ఒక్క నేత కూడా ఖండించడం లేదు. పవన్ కళ్యాణ్ పై బిఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా విమర్శలు చేస్తున్నారు. ఆ రెండు పార్టీలు అక్కడ రాజకీయ ప్రత్యర్థులు. అయినా సరే పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేసేందుకు పోటీ పడుతున్నాయి. కానీ ఏపీ నుంచి మాత్రం ఆ విమర్శలకు కౌంటర్ లేకుండా పోతోంది. ఇది అత్యంత బాధాకరం కూడా.

# 11 వేల ఓట్లు... కోటి రూపాయలే

ముంబై, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

మహారాష్ట్రలో మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికలకు కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉండగా, చంద్వాడ్‌లో ఒక ఆడియో క్లిప్ సంచలనం సృష్టించింది. 'మేము ఈవీఎం మెషీన్ ఆపరేటర్‌తో మాట్లాడాం. మీరు రూ.కోటి ఇస్తే, మీకు 11,250 ఓట్లు వేయిస్తాం' అని పేర్కొంటున్న ఆడియో క్లిప్ ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయంలో ఒక స్వతంత్ర అభ్యర్థి పోలీసులకు పిర్యాదు చేయడంతో చంద్వాడ్‌లో రాజకీయ వాతావరణం వేడెకింది.

చంద్వాడ్ నగర్ పరిషత్ మేయర్ పదవికి పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రాకేశ్ అహిరే ఈ క్లిప్‌ను బయటపెట్టారు. అహిరే ఆరోపణల ప్రకారం, శక్తి విలాస్ ధోమ్సే అనే వ్యక్తి అతనిని మొబైల్‌లో సంప్రదించాడు. డబ్బు ఇస్తే ఈవీఎంలను తారుమారు చేయడం ద్వారా ఓట్లు వేయిస్తామని ధోమ్సే అతడిని ప్రలోభపెట్టాడు. వైరల్‌గా మారిన ఈ సంభాషణలో, ధోమ్సే కొన్ని షాకింగ్ వాదనలు చేశారు. ఎన్నికల్లో బీజేపీ మేయర్ అభ్యర్థి వైభవ్ బాగుల్‌కు 13, 642 ఓట్లు వస్తాయని చెప్పారు. దీనిపై అహిరే సందేహాలు లేవనెత్తగా, 'మేము ఈవీఎం మెషీన్ ఆపరేటర్‌తో మాట్లాడాం, కాబట్టి ఈ లెకింపులో ఓట్లు కచ్చితంగా వస్తాయి' అని అతడు సమాధానమిచ్చాడు. ఈ క్లిప్‌పై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం !

- 3న హైదరాబాదులో మహాధర్నా
- పెద్ద ఎత్తున తరలి రావలసిందిగా పిలుపు
- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు రెగ్యులర్ గా ఇవ్వాల్సిన అక్రెడిటేషన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టి యు డబ్ల్యూ జే ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏకే ఫైసల్, సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు అనిల్ ప్రధాన కార్యదర్శి ఆసిఫ్ ఆరోపించారు. హెల్త్ కార్డులకు దిక్కులేదని, ఇక ఇళ్ల స్థలాలు అందని ద్రాక్షలా ఉన్నాయన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ,ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని అనేక సార్లు కలిసి చర్చించిందన్నారు. అంతేకాకుండా అనేకసార్లు వినతి పత్రాలను ఇచ్చిందన్నారు. కానీ ,గత 20 నెలలుగా అక్రెడిటేషన్స్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని బండారు యాదగిరి ఆరోపించారు. ఇప్పటికి కూడా పాత అక్రెడిటేషన్ కార్డులను పలు దఫాలుగా రెన్యూవల్ చేస్తున్నారే తప్ప, కొత్త కార్డులు ఇవ్వడం లేదని అన్నారు. ఇదేమని అడిగితే, ఇదిగో ,అదిగో అంటూ వాయిదాలు వేస్తున్నారని విమర్శించారు. అక్రిడేషన్ల జారీ ప్రక్రియ కార్యరూపం దాల్చటం లేదని యాదగిరి పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వ సాచివేత ధోరణికి నిరసనగా డిసెంబర్ 3న, ఉదయం 10 గంటలకు మాసాబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద మహా ధర్నాకు రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిందని తెలిపారు. మన ధర్మాగ్రహాన్ని ప్రభుత్వానికి తెలియజేయడమే ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లా లోని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాష్ట్ర ,జాతీయ కౌన్సిల్ సభ్యులు ,వివిధ సబ్ కమిటీల సభ్యులు తప్పకుండా ఈ ధర్నాకు హాజరు కావాలి. అతి ముఖ్యమైన ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా లోని ప్రతి జర్నలిస్టును కోరుతున్నామన్నారు.

# అభివృద్ధిపై చర్చకు సిద్ధం దాస్యంకు నాయిని సవాల్

వరంగల్, డిసెంబర్ 1,

పదేళ్లలో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఏం అభివృద్ధి చేశారో చర్చకు రావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సవాల్ చేశారు. 60వ డివిజన్ లో 1.60, లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే న్యాయని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వడ్డేపల్లి లోని మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ఇంటి చుట్టూ కూడా తానే అభివృద్ధి పనులు




చేశానన్నారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని అభివృద్ధి పనులను.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలో చేసిందన్నారు, వినయ్ భాస్కర్ గురించి మాట్లాడటం తన స్థాయి కాదని... చెడ్డి గ్యాంగ్ లాగా... తిరుగుతూ పనిగట్టుకొని కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు..

# స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

హైదరాబాద్ ,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

స్థానిక సంస్థలను గత బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్వీర్యం చేసి... ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఛాంబర్స్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. పురపాలిక వ్యవస్థ ఉనికికే ప్రమాదకారిగా మారిన... 2019లో పురపాలక నూతన చట్టాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి స్థానిక సంస్థలను కాపాడాలని ఆయన కోరారు. హైద్రాబాద్ హైదర్ గూడలోని మున్సిపల్ చాంబర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల ప్రాతినిధ్యం నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన రేవంత్ రెడ్డి... సమగ్రమైన పురపాలిక చట్టాన్ని రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పురపాలక చట్టం తీసుకువచ్చి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందన్నారు. పురపాలక పాలకవర్గాన్ని ఈ చట్టం వల్ల ఏ అధికారాలు ఉన్నాయో... ఒక్క సారి అధ్యయనం చేయాలని కోరారు. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల పటిష్టతత కోసం 73,74వ రాజ్యాంగ సవరణ చేసి... పట్టణాలు, పల్లెల అభివృద్ధికి ఊతమిస్తే గత బిఆర్ఎస్ ప్రభుత్వం తూట్లు పొడిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థలు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మారి నిర్వీర్యమయ్యాయన్నారు. ఈ చట్టాలతో స్థానిక సంస్థలపై అధికారాలు, అజమాయిషీలను జిల్లా కలెక్టర్లకు అప్పగించడంతో... వారు సామంత రాజులుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలౌతున్న విధంగా తెలంగాణలో చట్టాలను పున సమీక్షించాలని కోరారు. పురపాలక సంఘాల చైర్మన్ పదవులకు నేరుగా ఎన్నికలను నిర్వహించడం వల్ల సమర్థవంతంగా విధులు నిర్వహించే అవకాశం ఉందన్నారు.

# టైపింగ్ స్కిల్ ను కాపాడాలి

సికింద్రాబాద్. భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

స్కిల్ యూనివర్సిటీ అంటున్న ముఖ్యమంత్రి టైపింగ్ స్కిల్ ను కాపాడాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర టైప్ రైటింగ్ సంస్థల చైర్మన్ మర్రిరాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ లోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హాండ్ కంప్యూటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని సీనియర్ టైపింగ్ గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైపింగ్ నైపుణ్యాన్ని ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కంప్యూటర్ కీ బోర్డు ను ఉపయోగించే వారు కూడా టైపింగ్ నైపుణ్యం ఉన్నవారే రాణించగలరని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం టైపింగ్ యొక్క ఆవశ్యకతను గుర్తించి వారిని ప్రోత్సహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఏ లు గా, స్టెనోలుగా తీసుకొనే వారికి టైపింగ్, షార్ట్ హ్యాండ్ లో ఉత్తీర్ణత పొందిన వారికే ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా టైపింగ్ అర్హత తప్పనిసరి చేయాలన్నారు. తద్వారా తరతరాలుగా టైపింగ్ ఇన్ స్టిట్యూట్ లను నడిపిస్తూ వాటిపైనే ఆధారపడి జీవిస్తున్న వారిని ఆదుకోవాలని కోరారు.

# హెచ్ఐవి ప్రభావితుల పట్ల వివక్షను తొలగించాలి

## జిల్లా సివిల్ జడ్జ్ షైక్ బాబా ఫఖ్రుద్దీన్

కడప, డిసెంబర్ 1(భారత శక్తి) : సమాజంలో హెచ్ఐవి ప్రభావితుల పట్ల వివక్షను పూర్తిగా తొలగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ షైక్ బాబా ఫఖ్రుద్దీన్ పేర్కొన్నారు.

సోమవారం "ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం" సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ సంస్థ ఆధ్వర్యంలో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో కడప మున్సిపల్ ఆఫీసు నుండి డిఎంహెచ్ఓ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహిచడం జరిగింది.

అనంతరం డిఎంహెచ్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ & సీనియర్ సివిల్ జడ్జ్ షైక్ బాబా ఫఖ్రుద్దీన్ మాట్లాడుతూ హెచ్ఐవి ప్రభావితులు కూడా చట్టపరంగా సమాన హక్కులు కలిగినవారేనని, ఈ హక్కులను 2017 సవరణ చట్టం బలపరుస్తుందన్నారు. సమాజంలో హెచ్ఐవి ప్రభావితుల పట్ల వివక్షను పూర్తిగా తొలగించడం మన అందరి బాధ్యత అన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ వర్ష పరిస్థితులు ఉన్నప్పటికీ కళాశాలలు, వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయం అన్నారు. అధికారులు ప్రజలను హెచ్ఐవి పై అవగాహన పెంపొందించుకోవాలని, అపోహలు, వివక్షలు నిర్మూలించాలని, ప్రభుత్వ ఆరోగ్య సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రవిబాబు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు హెచ్ఐవి/ఎయిడ్స్ పై సరైన అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమన్నారు. అధికారులు ప్రజలను హెచ్ఐవిపై అవగాహన పెంపొందించుకోవాలని, అపోహలు, వివక్షలు నిర్మూలించాలని, ప్రభుత్వ ఆరోగ్య సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

జిల్లా ప్రోగ్రాం అధికారి భాస్కర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్




ఎయిడ్స్ నియంత్రణ మండలి 95-95-95 లక్ష్యాల సాధన కోసం నిరంతర చర్యలు చేపడుతోందన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత హెచ్ఐవి పరీక్షలు, కౌన్సిలింగ్ సేవలు, ఏ.ఆర్.టీ. చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు.

హెచ్ఐవి పాజిటివ్‌గా నిర్ధారణైన వారికి అందించే ఉచిత యాంటీ-రెట్రోవైరల్ థెరపీ వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, వైరల్ లోడ్ తగ్గించడంలో, సాధారణ జీవితం గడపడంలో కీలకమని తెలిపారు. ART సేవలు భద్రంగా, దీర్ఘకాలం అందుబాటులో ఉంటాయని ప్రజలకు అవగాహన కల్పించారు.

రిటైర్డ్ హెచ్.ఈ.ఓ. గుణశేఖర్ మాట్లాడుతూ.. హెచ్ఐవి నిర్మూలనకు సమాజంలోని అన్ని వర్గాల సహకారం అవసరమన్నారు.

ఈ సందర్భంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన వాలంటీర్లు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలకు సర్టిఫికెట్లు మరియు గుర్తింపు షీల్డ్‌లు అందజేశారు అలాగే హెచ్ఐవి వారికి న్యూట్రిషన్ (పౌష్టికాహారం) అందిస్తున్న భారతి, మరియు వికాశిత ఫౌండేషన్ వారిని సన్మానించడం జరిగింది .

ఈ సమావేశంలో డెమో భారతి, రిటైర్డ్ HEO గుణశేఖర్ గారు, CSC ప్రెసిడెంట్ ఉష రాణి, ప్రివెన్షన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్ పాల్గొనగా.. ర్యాలీ కార్యక్రమంలో NCC, NSS విద్యార్థులు, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ART సెంటర్లు, ఆశా వర్కర్లు పాల్గొని విజయవంతం చేశారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 1( భారత శక్తి ) : గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.





సోమవారం నిర్మల్ గ్రామీణ మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పంచాయితీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చిన వారితో మాట్లాడుతూ, నామినేషన్ కేంద్రంలో అన్ని వసతులు ఉన్నాయో లేవో వారిని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లు దాఖలు చేసే వారికి కుల ధ్రువపత్రాల జారి, బ్యాంకు ఖాతాలు తెరవడంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయేమో అడిగారు. అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అన్నారు. సిబ్బందితో మాట్లాడుతూ, హెల్ప్ డెస్క్ లో అందుబాటులో ఉంటూ, అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు. అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. క్లస్టర్ లో ఇప్పటి వరకు దాఖలు అయిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ ల వివరాలు వారి నుంచి అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకముల ఫారములను తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని వివరించారు. ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు.

ఈ తనిఖీలో డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో ఎంపీడీవో గజానన్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ స్టడీ సర్కిల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం: స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి.ప్రవీణ్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1: తెలంగాణ రాష్ట్రంలోని బీసీ, ఇతర విద్యార్థులకు ఉన్నత



విద్యను అభ్యసించేందుకు అత్యున్నత విశ్వవిద్యాలయాలలో అవకాశాలను కల్పించేందుకు అంతర్జాతీయ స్కాలర్షిప్ల పొందడం లక్ష్యంగా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్మాణాత్మక అవగాహన శేషంలు శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందని స్టడీ సర్కిల్ డైరెక్టర్ టి ప్రవీణ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవగాహన కార్యక్రమాలను ఐఎల్టిఎస్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందుకు ఆసక్తిగల విద్యార్థులు, డిగ్రీ పూర్తయిన అభ్యర్థులు ఈనెల 21వ తేదీ వరకు టీజీ బీసీ స్టడీ సర్కిల్ వెబ్సైట్ https://www.tgbcstudycircle.cgg.gov.inద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9949592991, 9494390803, నంబర్లలో, లేదా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని కోరారు.

# నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1 (భారత శక్తి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం లోని సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులు నిర్ణీత గడువు లోపు శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టర్ , ఆర్డీవో వెంకటేష్ తో కలసి శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జిల్లా కలెక్టర్ విఐపి, వివిఐపి పార్కింగ్ స్థలాలను రహదారులను , గద్దెల ప్రాంగణ అభివృద్ధి పనులు , రెడ్డిగూడెం అంతర్గత రహదారులను వాటి పనుల పురోగతిని ఆర్డీవో వెంకటేష్ ను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోపు పనులను పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు

# క్రీడలకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం

## – టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి
## –.బాస్కెట్బాల్ విజేతలకు బహుమతుల ప్రధానం



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని టీజీఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలో 11వ అంతర్ జిల్లా సీనియర్ బాస్కెట్బాల్ ముగింపు వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పురుష మహిళా క్రీడాకారులు క్రీడల్లోనూ రాణించి రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలన్నారు. ఈ సందర్భంగా అంతర్ జిల్లా బాస్కెట్బాల్ పోటీల్లో పురుషుల విభాగంలో ప్రథమ విజేతలుగా నిలిచిన హైదరాబాద్ జిల్లా జట్టుకు, ద్వితీయ స్థానంలో నిలిచిన రంగారెడ్డి, తృతీయ స్థానంలో నిలిచిన మేడ్చల్ జిల్లా జట్టుకు బహుమతులు అందజేశారు. మహిళల విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ స్థానంలో నిలిచిన హైదరాబాద్ జిల్లా, తృతీయ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్లకు ఆమె ట్రోఫీతో పాటు మెడల్స్ బహుకరించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను జట్లను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బాస్కెట్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పృద్వేశ్వర్ రెడ్డి మెదక్ జిల్లా బాస్కెట్బాల్ అధ్యక్షుడు రమేష్ రాష్ట్ర కోశాధికారి చంద్రశేఖర్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్ కాంగ్రెస్ నాయకులు సంతోష్, శ్రీకాంత్ గౌడ్ క్రీడాకారులు నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ



ములుగు జిల్లా ప్రతినిధి,డిసెంబర్ 01(భారతశక్తి):

ములుగు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ లో చేరిన కొత్త సభ్యుల చేతుల మీదుగా ములుగు జిల్లా కేంద్రంలో స్ట్రీట్ వెండర్స్కు నీడనిచ్చే పెద్ద లయన్స్ గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ములుగు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దొంతి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రోడ్లపై కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు అమ్ముకునే వ్యాపారులకు లయన్స్ పెద్ద గొడుగులు వారికి వర్షానికి ఎండకు ఉపయోగపడతాయని అన్నారు. లయన్స్ సభ్యుల సహకారంతో ఇక ముందు కూడా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ములుగు లయన్స్ క్లబ్ సెక్రటరీ చుంచు రమేష్, కోశాధికారి ఆడెపు రాజు, పి జెడ్ సి సానికొమ్మ రవీందర్ రెడ్డి, ఫాస్ట్ ప్రెసిడెంట్స్ మెరుగు రమేష్, కొండి సాంబశివ, దొంతి రెడ్డి బలరాం రెడ్డి నూతన లయన్స్ సభ్యులు సోమ నరసయ్య, డాక్టర్ ఎం రాజా, రుద్రోజ్

వంశీ, రుద్రోజు ఆనంద్ గంద్రత్ శ్రీధర్ పెట్టెం రాజేందర్, ములుగు లయన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

పటాన్చెరు, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 1:



ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన పాలోత్ రఘు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు జిఎంఆర్ ద్వారా ఎల్ ఓ సి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని ఎమ్మెల్యే జిఎంఆర్ సోమవారం పటాన్చెరు లోని తన కార్యాలయంలో రఘు కుటుంబ సభ్యులకు అందజేశారు.

# డీజీపీ ఆధ్వర్యంలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 జూమ్ సమావేశం

## హాజరైన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 1 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి, శాంతి%-%భద్రత, పరిపాలనా సామర్థ్య పెంపు, స్మార్ట్ గవర్నెన్స్ లాంటి ముఖ్యాంశాలపై దృష్టి సారిస్తూ రాష్ట్ర డీజీపీ శ్రీ శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ %-% 2047 జూమ్ సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఐపీఎస్ అధికారులు, డిప్యూటేషన్ యూనిట్ల అధికారులు, చీఫ్ ఆఫీస్‌కు చెందిన స్టాఫ్ ఆఫీసర్లు హాజరయ్యారు. రాష్ట్ర భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, భవిష్యత్తు పట్టణ, గ్రామీణ అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా పోలీసింగ్ విధానాలను మెరుగుపరచడంపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది.నిర్మల్ జిల్లా నుండి జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఈ జూమ్ సమావేశానికి హాజరై, జిల్లాలో అమలు చేస్తున్న మంచి పద్ధతులు, భద్రతా చర్యలు, ప్రజా సేవల విస్తరణ కోసం చేపడుతున్న వినూత్న విధానాలను గురించి వివరించారు. అదే సమయంలో, భవిష్యత్‌లో తెలంగాణను ఒక గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టే దిశగా పోలీస్ శాఖ పాత్ర, నూతన వ్యూహాలు, సాంకేతిక ఆధారిత సేవల విస్తరణ వంటి అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు.

రాష్ట్రంలో ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసి, స్మార్ట్, స్పందనాత్మక, పారదర్శక పోలీసింగ్ వైపు అడుగులు వేయడానికి ఈ సమావేశం కీలకంగా నిలిచిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# సైన్స్ జీవితానికి ఉపయోగపడాలి

## బాల వైజ్ఞానిక ప్రదర్శిని ముగింపు కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీరాం మొండయ్య

### సాంస్కృతిక ప్రదర్శనలతో ఘనంగా ముగింపు ఉత్సవ కార్యక్రమం

### మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన



కరీంనగర్, డిసెంబర్ 1(భారతశక్తి ప్రతినిధి):

సైన్స్ జీవితానికి ఉపయోగపడాలని జిల్లా విద్యాధికారి శ్రీరామ్ ముందయ్య అన్నారు. గత

మూడు రోజులుగా కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్లో జరుగుతున్న బాల వైజ్ఞానిక ప్రదర్శిని 25-26 ముగిసింధీ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ప్రతి విద్యార్థి లోపల ఒక శాస్త్రవేత్త దాగి ఉన్నాడని, బయటకు తీసి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని పేర్కొన్నారు.

శ్రమ పట్టుదలతో పని చేస్తే సాధించలేనిది ఏమీలేదని విద్యార్థులు శ్రమించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని వారు సూచించారు.

ఈరోజు సైన్స్ రేపటి అభివృద్ధి చెందిన టెక్నాలజీకి దారి తీస్తుందని అది మానవాళి క్షేమానికి ఉపయోగపడుతుందని, మానవాళి సంక్షేమానికి ఉపయోగపడేదే అసలైన సైన్స్ అని వారు తెలిపారు.

ఆత్మనిర్భర్ భారత్ లో భాగంగా ప్రతి విద్యార్థి ఒక ప్రాజెక్టుతో ముందుకు రావాలని ఆ ప్రాజెక్టు నేటి సమస్యలకు రేపటి పరిష్కారం కనుగొనే దిశగా రూపొందించాలని సూచించారు.

మనం టెక్నాలజీ పేరుతో ముందుకు వెళ్లాల్సిందే కానీ మనం మూలాలను మరవద్దని మనది వ్యవసాయ ఆధారిత దేశం కాబట్టి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుల కోసం టెక్నాలజీ ఉపయోగించుకొని వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు

సైన్స్ అనేది మానవ జీవితానికి ఉపయోగపడాలి తప్ప వినాశనానికి కాదని ఏ నూతన ఆవిష్కరణ అయినా మానవ వికాసానికి దారి తీయాలని ఆ దిశగా విద్యార్థుల కృషి చేయాలని వారు సూచించారు.

సూత్రాలు వల్లెవేయడం వలన లాభం లేదని దానిలోని లాజిక్కుని తెలుసుకొని ముందడుగు వేయాలని వారు తెలిపారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఐఐటీలు, నీటులు, నిట్ లు వదిలేసి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి జాతీయస్థాయిలో మంచి మంచి లాబరేటరీలు ఉన్నాయని అందులో సీటు సంపాదించి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగి ఈ దేశానికి సేవ చేయాలని వారు కోరారు.

విద్యార్థి దశనుండే నూతన ఆవిష్కరణలు దిశగా విద్యార్థుల ఆలోచన సాగాలని ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యం కేవలం ఐఐటిలే కాదని అద్భుతమైన ఆవిష్కరణలకు ఎన్నో మార్గాలు ఉన్నాయని వాటిలో ఐఏఎస్సి బెంగళూరు, ఐసిఐఆర్, ఏసర్, ఐసర్ వంటి గొప్ప సంస్థలలో పరిశోధన చేసినట్లయితే గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందని సూచించారు.

జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ బాల వైజ్ఞానిక ప్రదర్శిని అంగరంగ వైభవంగా సాగిందని మూడు రోజుల కార్యక్రమంలో ఎగ్జిబిట్స్ ప్రదర్శించిన విద్యార్థులు, గైడ్ టీచర్స్ వాళ్ల ప్రదర్శనతో పాటు ఇతరుల ప్రదర్శనలను తిలకించి సైన్స్ ఎక్స్ప్లోర్ చేసుకున్నారని, ఇది గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ ఎగ్జిబిషన్ కు 807 ఎగ్జిబిట్స్, 126 ఇన్స్పైర్ అవార్డ్స్ మనక్ వచ్చాయని మొదటి రోజు 1600 మంది విద్యార్థులు సందర్శించారని రెండో రోజు 2652 మంది విద్యార్థులు , ఈరోజు 5357 మంది విద్యార్థులు దాదాపు 176 పాఠశాలలు సందర్శించాయని తెలిపారు.

తదనంతరం ఫలితాలు ప్రకటించడం జరిగింది.

ఈ ఫలితాలలో 13 ప్రాజెక్టు ఇన్స్పైర్ కోసం రాష్ట్ర స్థాయికి ఎన్నిక కాబడినాయని మిగతావి ప్రతి థీమ్ నుండి ప్రథమస్థానంలో వచ్చిన వాటిని రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎస్ భగవంతయ్య, సెక్టోరియల్ అధికారులు కర్ర అశోక్ రెడ్డి, ఆంజనేయులు, మిల్కూరి శ్రీనివాస్, కృపారాణి,ఎస్జీఎఫ్ సెక్రటరీ వేణుగోపాల్ కొత్తపల్లి మండల విద్యాశాఖాధికారి ఆనందం,

ఏనుగు ప్రభాకర్ రెడ్డి, వివిధ మండలాల విద్యాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గాజుల రవీందర్,కెఎస్.అనంతాచార్య, స్తంభంకాడి గంగాధర్

మరియు గైడ్ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్ స్పైర్ - మనక్ విజేతలు

మొత్తం 13 మంది విజేతలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరిగింది. జె.వైష్ణవి, టి.జి.ఎమ్.ఎస్. చిగురుమామిడి,

పి.సాయి గణేశ్, జెడ్.పి.హెచ్.ఎస్ బూరుగుపల్లి

ఎస్.శశివర్ధన్, జెడ్.పి.హెచ్.ఎస్ గట్టుబూత్కూర్,

ఎ.వికాస్, పారమిత హెరిటేజ్ స్కూల్,

ఎస్.అవిజ్ఞ, ఆల్ ఫోర్స్ హై స్కూల్,

ఎన్.సుశీల్ కుమార్, భగవతి హై స్కూల్

సి.హెచ్.సాత్విక్ రెడ్డి, ఏకశిల పాఠశాల,

ఇ.సహస్ర, కె.జి.బి.వి. కరీంనగర్,

ఎం హరినాథ్ రెడ్డి, పారమిత హై స్కూల్,

బి.మనోజ్ఞ, రావుస్ టెక్నో స్కూల్,

వి.అనూష్ రాజ్, సెంట్ జార్జ్ పాఠశాల,

ఎన్.వర్షిత, వింధ్యావళి హై స్కూల్,

ఎం.చరితేశ్, జడ్.పి.హెచ్.ఎస్ మొలంగూర్

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మొదటి స్థానం పొందిన విజేతలు

సుస్థిర వ్యవసాయం అనే అంశంలో జూనియర్ విభాగంలో అబ్దుల్ రెహమాన్ సద్, ఇక్రా జమి స్కూల్,

సీనియర్స్ విభాగంలో డి.అమర్ నాథ్, సాయి మానేర్ స్కూల్, వ్యర్థ పదార్థాల నిర్వహణలో జూనియర్స్ విభాగంలో ముజకిర్, ఆల్ఫోర్స్ హై స్కూల్,

సీనియర్స్ విభాగంలో మిహా ముబారక్, పారమిత హెరిటేజ్ స్కూల్,

పునరుత్పాదక శక్తి అంశంలో జూనియర్స్ విభాగంలో ఎ.మదన్ జోస్, అల్ఫోర్స్ హై స్కూల్,

సీనియర్స్ విభాగంలో నితీశ్ కుమార్, ఆల్ఫోర్స్ హై స్కూల్,

అభివృద్ధి చెందుతున్న సాంకేతిక అంశంలో జూనియర్స్ విభాగంలో బి.శ్రీధర్ జడ్పిహెచ్ఎస్ బూరుగుపల్లి,

సీనియర్స్ విభాగంలో జె.శ్రీవన్శిక, ఏకశిల హైస్కూల్,

రిక్రియేషనల్ గణిత నమూనాల అంశంలో జూనియర్స్ విభాగంలో బి.స్నితిక్, ఆల్ఫోర్స్ హై స్కూల్,

సీనియర్స్ విభాగంలో ఎస్.అర్చన జెడ్పిహెచ్ఎస్ మల్కాపూర్,

ఆరోగ్యము పరిశుభ్రత అంశంలో జూనియర్స్ విభాగంలో కె.రుగ్వేద, పారమిత హైస్కూల్,

సీనియర్స్ విభాగంలో కె.లక్ష్మి ప్రసన్న, టెట్రా హైడ్రాన్ పాఠశాల, నీటి సంరక్షణ నిర్వహణ అంశంలో జూనియర్స్ విభాగంలో హర్షిత్ కె.పి.ఎస్. హైస్కూల్,

సీనియర్ విభాగంలో వి.హర్షిత్, టి.ఎం.ఆర్.ఎ. కరీంనగర్.ఉపాధ్యాయుల విభాగంలో స్రవంతి ఎం.పి.యు.పి.ఎస్. చర్లబుత్కూరు మొదటి స్థానం పొందారు.ప్లాస్టిక్ కాలుష్య నివారణకు సంబంధించిన అంశంలో నిర్వహించిన సెమినార్ లో అనుశ్రీ టి.జి.ఎం.ఎస్. ముల్కనూర్ మొదటి స్థానం పొందారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అన్ని స్థానాలలో విజయం సాధిస్తారు:రాష్ట్ర టూరిజం అభివృద్ధి శాఖ చైర్మన్- పటేల్ రమేష్ రెడ్డి

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 1:

త్వరలో నిర్వహించబోయే మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అభ్యర్థులు అందరూ అన్ని స్థానాలలో గెలుపొందుతారని రాష్ట్ర టూరిజం అభివృద్ధి శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.





గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మొదటి విడత నామినేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలో 2 మండలాలు మొదటి విడతలో, మరిన్ని 2 మండలాలు రెండో విడతలో పూర్తిచేయనున్నట్లు ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించినట్లు వివరించారు. గ్రామాల్లోని ప్రజల్లో విశేష ఉత్సాహం కనిపిస్తోందని, ప్రతి గ్రామంలో 5 నుండి 15 మంది వరకు అభ్యర్థులు పోటీకి వస్తున్నారని రమేష్ రెడ్డి తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ, ప్రజల ఇంటికే ప్రభుత్వ సేవలు చేరేలా పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని చెప్పారు. గత 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలన తరువాత, మరోసారి రాజశేఖర్ రెడ్డి కాలం తరహాలో ప్రజలకు అనుకూలమైన, పారదర్శక పాలన ఇప్పుడు కొనసాగుతోందని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పేదలకు ఒక్క ఇల్లు అందకపోగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, వేగంగా పనులు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, వడ్లకు బోనస్, ఉద్యోగాల భర్తీ వంటి కీలక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని తెలిపారు. నాణ్యతలేని చీరలు పంచిన బిఆర్ఎస్ ప్రభుత్వానికి భిన్నంగా, కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యమైన ఇందిరమ్మ చీరలు ప్రజలకు అందజేస్తోందని అన్నారు. కొన్ని గ్రామాల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు కూడా పోటీకి రావడాన్ని వెనుకంజ వేస్తుండటం ప్రజల మారుతున్న అభిప్రాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. అటువంటి చోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎకగ్రీవం చేయాలని ప్రజలను కోరారు. గత రెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను విజయవంతం చేయాలని పటేల్ రమేష్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## టి జి ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నమనేని జగన్ మోహన్ రావు ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)డిసెంబర్1:

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, హనుమకొండ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం ఐ.డి.ఓ.సి., హన్మకొండలోని టీజీవో భవన్ నందు నిర్వహించబడింది.

ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఆకవరం శ్రీనివాస్ కుమార్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి డాఎం ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సమావేశం లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై కూలంకషంగా చర్చించారు.

అనంతరం క్రింది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

డిసెంబర్ 31 న ఖాళీ కాబోతున్న టీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి టీజీవో అసోసియేషన్ ఏర్పడినప్పటి నుండి సంఘాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ముఖ్యపాత్ర పోషించి, అనేక శాఖల అధికారుల సమస్యలను రాష్ట్రస్థాయిలో పరిష్కరించేవిధంగా చొరవ చూపిన నాయకుడిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ గా ఉండి ఆరు జిల్లాల శాఖలను క్రియాశీలకంగా ఉంచి రెండు జిల్లాలలో అసోసియేషన్ కు ప్రభుత్వ భూమిని కేటాయింపచేసి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాష్ట్రంలోనే మొదటి టీజీవో భవనాన్ని రూ. 80 లక్షల నిధులతో నిర్మించిన వ్యక్తిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్ మోహన్ రావు ని టీజీవో కేంద్ర సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి సముచితమైన వారిగా భావించి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవలసిందిగా కోరుతూ తీర్మానించనైనది. ఈ విషయమై రాష్ట్ర అధ్యక్షుల వారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో చొరవ చూపవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ తీర్మానించనైనది. లేనిపక్షంలో అసోసియేషన్ బైలా ప్రకారం ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నిక నిర్వహించవలసినదిగా తీర్మానించనైనది.

ఇతర తీర్మానాలు:

1. ఉద్యోగుల పెండింగ్ బిల్స్ అన్నింటిని వెంటనే ప్రభుత్వం చెల్లించాలి. బకాయిపడిన డి.ఏ. లను మంజూరు చేసి నూతన పి.ఆర్.సీ ని ప్రకటించాలి.

2. శాఖల వారీగా ఉన్న వివిధ ఆర్థికేతర సమస్యలు



ముఖ్యంగా క్యాడర్ స్ట్రెంత్ లను సవరించి దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ప్రమోషన్ సమస్యలను పరిష్కరించాలి.

3. ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల సాధనకు టీజీవో కేంద్ర సంఘం తీసుకునే అన్ని కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతునిస్తూ కేంద్ర నాయకత్వం ప్రకటించే కార్యాచరణలో జిల్లాలోని అధికారులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని తీర్మానించడమైయినది.

4. 2025 సంవత్సరానికి గాను అసోసియేషన్ సభ్యత్వ నమోదు ప్రక్రియను 100% పూర్తి చేయాలని తీర్మానించడమైయినది.

5. టీజీవో డైరీ 2026 కొరకు ప్రతీ కార్యవర్గ సభ్యులు డేటా , ప్రకటనల సేకరణను డిసెంబర్ 5 వరకు పూర్తి చేయాలని తీర్మానించడమైనది.

6. గెజిటెడ్ అధికారులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని తీర్మానించడమైనది.

ఈ సమావేశంలో సహాధ్యక్షులు పి. వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, కోశాధికారి పి. రాజేష్ కుమార్, మాధవి, సురేష్ కుమార్, శ్రీనివాసరావు, డాఎం మహేష్ కుమార్, మాధవ రెడ్డి, వాసం శ్రీనివాస్, రమేష్, సంతోష్ కుమార్, డాఎం విక్రం, రాజేశ్వర్ కుమార్, రవీంద్ర, ఆంజనేయులు పాల్గొన్నారు.



## పి డి ఎస్ యు జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి. సురేష్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 01: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యూ కామారెడ్డి 23వ జిల్లా మహాసభలు కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 28వ తేదీన నిర్వహించడం జరిగిందని, కామారెడ్డి జిల్లా కేంద్రంలో పిడిఎస్యు బలమైన విద్యార్థి ఉద్యమాలను నిర్మించినందుకు తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో నియమించినందుకు బాధ్యతతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు ఈ బాధ్యత అప్పజెప్పినందుకు హర్షం వ్యక్తం చేశారు.

## ఎన్నికలలో రిటర్నింగ్ ఆఫీసర్లు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, డిసెంబరు 1:

త్వరలో నిర్వహించబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారులు నిష్పక్షపాతంగా పార దర్శకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో బాధ్యతగా ఎన్నికల విధులు



నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఫేస్-టు రిటర్నింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని రిటర్నింగ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు రిటర్నింగ్ ఆఫీసర్ కు పూర్తి బాధ్యత ఉంటుందని, అభ్యర్థి రోజు వారి ఎన్నికల ఖర్చు వివరాలను తనిఖీ చేయడం, వివరాలు ఇవ్వడంలో విఫలమైతే వారికి నోటీసులు జారీ చేసే అధికారం, మండల కేంద్రం నుండి పోలింగ్ మెటీరియల్ సర్పంచ్, వార్డు పోలింగ్ కేంద్రానికి, పి ఓ కి అందచేయాలని మీకు సంబంధించిన గ్రామపంచాయతీలో పోలింగ్ స్టేషన్ ఏర్పాట్లు ఇతర పోలింగ్ ఏర్పాట్లు పరిశీలించాలని, ఓటర్లకు బిఎల్ఓ ద్వారా ఫోటో ఓటర్ స్లిప్స్ పంపిణీ చేయాలని, పోలింగ్ సిబ్బందిని పోలింగ్ స్టేషన్ కు పంపించడం సామాగ్రి సరఫరా, పోలింగ్ సమర్థవంతంగా పర్యవేక్షించడం, పై అధికారులకు నివేదికలు పంపించాలని, పోలింగ్ జరిగేటప్పుడు ఏదైనా అనుకోని సమస్య ఎదురైతే వాటిని పరిష్కరించాలని కౌంటింగ్ ప్రదేశం, పోలీస్ సిబ్బంది, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు, ఫలితాలు ప్రకటించుట, ఉప సర్పంచ్ ఎన్నిక, ధ్రువపత్రాల పంపిణీ, వ్యయాన్ని పర్యవేక్షించటం, పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ సంబంధిత విధులు రిటర్నింగ్ ఆఫీసర్లు సమర్థవంతంగా నిర్వహించాలని పూర్తిగా చెక్ లిస్ట్ ప్రకారం బాధ్యతలు నిర్వహించాలని, ఎలాంటి పొరపాటు జరిగినచో ఎన్నికలపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని కోల్పోవడం జరుగుతుందని, ప్రజాస్వామ్య బద్ధంగా, బాధ్యతయుతముగా ఎన్నికల విధులు నిర్వహించి సూర్యాపేట జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేయడం మీ అందరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిపిఓ యాదగిరి, డి ఆర్ డి ఏ పి డి వి వి అప్పారావు, డీఎఫ్ఓ సతీష్, ట్రైనర్లు రమేష్, వెంకటేశ్వర్లు,రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## రాయ్‌పుర్ స్టేడియం..
# అప్పుడు బౌలర్ల హవా.. మరి ఇప్పుడో?

సౌతాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో గెలిచిన టీమ్‌ఇండియా.. రెండో మ్యాచ్‌లోనూ విజయంపై కన్నేసింది. డిసెంబర్ 3న (బుధవారం) రాయ్‌పుర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం రెండో వన్డేకు ఆతిథ్యమివ్వనుంది. సోమవారం సాయంత్రం భారత జట్టు రాయ్‌పుర్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 20తో కైవసం చేసుకుంటుంది. ఈ స్టేడియంలో భారత్ ఇప్పటివరకు ఒకే మ్యాచ్ ఆడగా అందులో ఘన విజయం సాధించింది. ఆ మ్యాచ్‌లో బౌలర్ల హవా కొనసాగడంతో భారత్ 8 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ అందుకుంది. 2023 జనవరిలో భారత్, న్యూజిలాండ్ ఈ స్టేడియంలో తలపడ్డాయి. టాస్ గెలిచిన టీమ్‌ఇండియా బౌలింగ్ ఎంచుకుంది. మహ్మద్ షమి (3/18), వాషింగ్టన్ సుందర్ (2/7), హార్దిక్ పాండ్య (2/16) విజృంభించడంతో కివీస్ 108 పరుగులకే కుప్పకూలింది. సిరాజ్, శార్దూల్ ఠాకూర్, కుల్‌దీప్ యాదవ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ రెండు



వికెట్లు కోల్పోయి 20.1 ఓవర్లలో ఛేదించింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (51), శుభ్‌మన్ గిల్ (40*) రాణించారు. వన్‌డౌన్‌లో వచ్చిన కోహ్లి (11) నిరాశపర్చాడు. పిచ్ రిపోర్ట్ రాయ్‌పుర్ పిచ్ సమతూల్యంగా ఉంటుంది. ఇటు బ్యాటర్లకు, అటు బౌలర్లకు అనుకూలిస్తుంది. దీంతో తొలి వన్డే మాదిరిగానే మ్యాచ్ రసవత్తరంగా సాగే అవకాశముంది. ఈ పిచ్‌పై స్పిన్నర్లతోపాటు సీమర్లు ప్రభావం చూపిస్తారు. దేశంలోని పెద్ద గ్రౌండ్లలో ఇది ఒకటి. బౌండరీలు దూరంగా ఉంటాయి. ఈ మ్యాచ్ కోసం భారత్ తుది జట్టులో ఒక మార్పు చేసే అవకాశముంది. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ స్థానంలో రిషభ్ పంత్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ప్లేయింగ్ ఎలెవన్‌లోకి రావొచ్చు.

## జట్టు ఎంపికలో
## ఏదో తప్పు జరుగుతోంది : రవిచంద్రన్ అశ్విన్

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో చోటు దక్కలేదు. నితీశ్‌కు బదులుగా స్పిన్ ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌కు అవకాశమిచ్చారు. హార్దిక్ పాండ్య అందుబాటులో లేని వేళ నితీశ్‌ను సిరీస్‌కు ఎంపిక చేసి ప్లేయింగ్ ఎలెవన్‌లోకి ఎందుకు తీసుకోవడం లేదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశ్నించాడు. జట్టు ఎంపికలో ఏదో తప్పు జరుగుతోందని అశ్విన్ వ్యాఖ్యానించాడు. 'హార్దిక్ పాండ్య జట్టులో లేకపోయినా నితీశ్ కుమార్ రెడ్డికి ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కలేదంటే కచ్చితంగా జట్టులో ఎంపికలో ఏదో తప్పుగా జరుగుతోందని అర్థమవుతోంది. నితీశ్‌ని ఎందుకు ఎంపిక చేశారు? హార్దిక్ లేని లోటును అతను పూడ్చగలడు. అవకాశాలిస్తూ పోతే



మెరుగవుతాడు. కానీ, ఈ తుది జట్టులో నితీశ్‌కు చోటు లభించకపోతే జట్టు ఎంపికపై సమీక్షించాల్సి ఉంటుంది' అని అశ్విన్ పేర్కొన్నాడు. ఇటీవల కాలంలో టీమ్‌ఇండియా వన్డేల్లో, టీ20ల్లో దూకుడుగా బ్యాటింగ్ చేస్తోంది. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ కృషితో ఇది సాధ్యమైందని అశ్విన్ అన్నాడు. భారత్, సౌతాఫ్రికా మధ్య బుధవారం (డిసెంబర్ 3న) రాయ్‌పుర్ వేదికగా రెండో వన్డే జరగనుంది.

## ఆ మ్యాచ్ ముగియగానే..
# వాట్సాప్‌లో వెయ్యి మెసేజ్‌లు: జెమీమా రోడ్రిగ్స్

భారత మహిళల క్రికెట్ జట్టు 2025 ప్రపంచ కప్ సాధించడంలో జెమీమా రోడ్రిగ్స్ కీలకపాత్ర పోషించింది. ముఖ్యంగా ఆస్ట్రేలియాతో జరిగిన సెమీ ఫైనల్‌లో జెమీమా (127 నాటౌట్; 134 బంతుల్లో) శతకం బాదడంతో భారత్ 339 పరుగుల ఛేదనతో ప్రపంచ రికార్డు సృష్టించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రోడ్రిగ్స్.. ఆసీస్‌తో సెమీస్ తర్వాత తన ఫోన్‌లో వాట్సప్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేసినట్లు వెల్లడించింది. వందల సంఖ్యలో మెసేజ్‌లు రావడంతో అలా చేశానని పేర్కొంది. 'సెమీ ఫైనల్‌లో సూపర్



ఇన్నింగ్స్ తర్వాత నా ఫోన్ మోగుతూనే ఉంది. నాకు ఎక్కడెక్కడి నుంచో కాల్స్ వస్తున్నాయి. వారికి నా నంబర్ ఎలా తెలిసిందో కూడా నాకు తెలీదు. నేను ఎక్కువ చేసి చెప్పుకోవడం లేదు. కానీ, నాకు 1000 వాట్సాప్ మెసేజ్‌లు వచ్చాయి. వాటన్నింటికి నేను స్పందించలేకపోయాను. ఎందుకంటే ఆ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. నాకు చాలా భావోద్వేగాలు ఉన్నాయి. అంతేకాకుండా టోర్నమెంట్ ముగియలేదు. నేను ఫైనల్‌కు సిద్ధమవుతున్నాను. నేను అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాను. భారత్ ఫైనల్‌కు చేరుకుంది. కానీ, మేం ఇంకా ప్రపంచ కప్ ఫైనల్ గెలవాలి. ఇవన్నీ ఆలోచిస్తున్న తరుణంలో మెసేజ్‌ల సంఖ్య మరింత ఎక్కువైపోయింది. దీంతో నా సన్నిహితులకు కాల్ లేదా సాధారణ సందేశాలతో టచ్‌లో ఉందని చెప్పి వాట్సప్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేశా. వరల్డ్ కప్ ఫైనల్ ముగిసేవరకు వాట్సప్‌ను ఇన్‌స్టాల్ చేయలేదు. సోషల్ మీడియాకు కూడా దూరంగా ఉన్నా. బహుశా సెమీస్ తర్వాత ఓ పోస్ట్ పెట్టి ఉండొచ్చు. కానీ, ఫైనల్ వరకు సోషల్ మీడియాకు దూరంగా ఉన్నా. ప్రపంచ కప్ తర్వాత నేను మళ్లీ ఎప్పటిలా సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉన్నా. నా సోషల్ మీడియా అకౌంట్లలో మొత్తం సెమీ ఫైనల్స్ లేదా భారత్ ప్రపంచ కప్ గెలిచిన పోస్టులే ఉన్నాయి. నేను అలాంటి దృశ్యాన్ని ఎప్పుడూ చూడలేదు' అని జెమీమా రోడ్రిగ్స్ పేర్కొంది.

## హార్దిక్ పాండ్యకు లైన్ క్లియర్.. SMATలో ఆడనున్న ఆల్‌రౌండర్!

భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE)లో ఇంటెన్సివ్ రిహాబ్ బ్లాక్‌ను హార్దిక్ పూర్తిచేసుకున్నాడు. ఈ ఏడాది జరిగిన ఆసియా కప్ సూపర్ 4లో శ్రీలంకతో మ్యాచ్ సందర్భంగా అతడు గాయపడ్డాడు. దీంతో తర్వాత జరిగిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అక్టోబర్ 14న CoEలో చేరిన పాండ్య.. ఆరు వారాలపాటు మెడికల్, స్పోర్ట్స్ సైన్స్ స్టాఫ్ పర్యవేక్షణలో ఉన్నాడు. అతను పూర్తి ఫిట్‌గా ఉన్నట్లు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్లియరెన్స్ ఇచ్చింది. బౌలింగ్ చేయడానికి కూడా ఓకే చెప్పింది. దీంతో ప్రస్తుతం జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హార్దిక్ బరోడా తరఫున బరిలోకి దిగనున్నాడు. డిసెంబరు 2న పంజాబ్, డిసెంబర్ 4న గుజరాత్‌తో మ్యాచ్ ఆడే ఛాన్స్ ఉంది. డిసెంబర్ 9 నుంచి భారత్, సౌతాఫ్రికా మధ్య ఐదు టీ20ల సిరీస్ మొదలుకానుంది. ఈ సిరీస్‌కు పాండ్యను ఎంపిక చేయడం ఖాయంగా కనిపిస్తోంది.




### AI ఇంటిగ్రేషన్‌తో మెటా స్మార్ట్‌గ్లాసెస్
## 12MP కెమెరా.. 48 గంటల బ్యాటరీ

కృత్రిమ మేధ అనుసంధానంతో వచ్చిన ఓక్లీ మెటా స్మార్ట్ గ్లాసెస్ ఇప్పుడు భారత మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. ప్రముఖ క్రీడా పరికరాల తయారీ సంస్థ ఓక్లీ భాగస్వామ్యంతో మెటా ఈ గ్లాసెస్‌ను తీసుకొచ్చింది. వీటితో హైక్వాలిటీ వీడియోలు, ఫొటోలు తీయొచ్చు. దీనిలోని వాయిస్ అసిస్టెంట్ ద్వారా అనేక పనులు సులభంగా చేసేయొచ్చు.

**ఓక్లీ మెటా గ్లాసెస్ ధర**

మెటా AI సపోర్ట్‌తో పనిచేసే ఓక్లీ మెటా HSTN గ్లాసెస్ ప్రారంభ ధర రూ.41,800. ఈ ధర క్లియర్ , ప్రిజమ్ వేరియంట్లకు వర్తిస్తుంది. ప్రిజమ్ పోలరైజ్డ్ లెన్స్ ఉన్న మోడల్ ధర రూ.44,200. ప్రిజమ్ ట్రాన్సిషన్ లెన్స్ ఉన్న గ్లాసెస్‌ను రూ.47,600కు కొనుగోలు చేయొచ్చు. దేశంలోని అన్ని ప్రముఖ ఆప్టికల్, ఐవేర్ రిటైలర్లు, సన్‌గ్లాస్ స్టోర్లలో ఇవి విక్రయానికి



అందుబాటులో ఉంటాయి.

**ఓక్లీ మెటా గ్లాసెస్ ఫీచర్లు**

ఓక్లీ మెటా గ్లాసెస్‌లో 12 మెగాపిక్సెల్ కెమెరా ఉంది. ఇది 3కే వీడియో రిజల్యూషన్‌లో సెకనుకు 30 ఫ్రేమ్‌ల వేగంతో వీడియోలను రికార్డు చేయగలదు. వీడియో రికార్డింగ్ కోసం ఇందులో స్టాండర్డ్, స్లో మోషన్, హైపర్‌లాప్స్ వంటి మోడ్‌లు ఉన్నాయి. వినియోగదారులు 3024 x 4032 పిక్సెల్స్ రిజల్యూషన్‌లో ఫొటోలు కూడా తీయొచ్చు.

# అధిక పింఛనుకు 17.49 లక్షల దరఖాస్తులు..
# 99% పరిష్కారం!

దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (EPFO) ద్వారా అధిక పింఛను (Higher pension) కోసం వచ్చిన దరఖాస్తుల్లో దాదాపు 99 శాతం పరిష్కారమయ్యాయి. ఈ విషయాన్ని కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే సోమవారం పార్లమెంటులో వెల్లడించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఈ ప్రక్రియను వేగవంతం చేశామని తెలిపారు.

*** మొత్తం 17.49 లక్షల దరఖాస్తులు**

అధిక పింఛను (Higher pension) కోసం పెన్షనర్లు, సభ్యుల నుంచి మొత్తం 17.49 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 15.24 లక్షల అప్లికేషన్లను యజమానులు 2025 జనవరి 31 వరకు EPFOకు పంపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు మొత్తం 4,27,308 మందికి డిమాండ్ లెటర్లు జారీ చేశారు. అయితే, ఆ తరువాత 34,060 కేసులు అనర్హమని తేలాయి. దీనికి ముఖ్య కారణం, డిమాండ్ చేసిన మొత్తాన్ని జమ చేయకపోవడమే.



మొత్తం దరఖాస్తుదారుల్లో 2,33,303 మంది వారి సమ్మతిని తెలియజేశారు. వీరిలో 96,274 మంది ఉద్యోగాల్లో కొనసాగుతుండగా 1,37,029 మంది ఇప్పటికే పదవీ విరమణ చేశారు. రిటైర్ అయిన వారిలో 1,24,457 మందికి పెన్షన్ చెల్లింపు ఉత్తర్వులు (PPO) ఇప్పటికే జారీ అయ్యాయి. మరో 12,572 PPOలు తుది దశలో ఉన్నాయని మంత్రి సభకు తెలిపారు.

**ఏంటీ అధిక పింఛను అంశం..**

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (EPFO) నిర్వహించే ఉద్యోగుల పెన్షన్ పథకం (EPS) 1995 కింద పెన్షన్ లెక్కించడానికి, ఒక ఉద్యోగి వేతనాన్ని నెలకు రూ.15,000కు పరిమితం చేశారు. దీని అర్థం, ఎవరైనా ఉద్యోగి రూ.15,000 కంటే ఎక్కువ జీతం తీసుకున్నా, ఆ మొత్తంలో 8.33 శాతం (యజమాని వాటా) మాత్రమే పెన్షన్ ఫండ్‌కు జమ అవుతుంది. దీంతో, అధిక వేతనాలు పొందే వారికి కూడా తక్కువ పెన్షన్ వచ్చేది. ఈ పరిమితిని సవాలు చేస్తూ, ఉద్యోగులు తమ వాస్తవ వేతనం (Full salary)పై అంటే, పరిమితి లేకుండా మొత్తం జీతంపై పెన్షన్ ఫండ్‌కు అధికంగా వాటా చెల్లించడానికి, తద్వారా పదవీ విరమణ తర్వాత అధిక పింఛను పొందడానికి అనుమతించాలని ఉద్యోగులు కోరుకున్నారు. ఈ అంశమే వివాదానికి మూలమైంది.

*** ప్రభుత్వ బ్యాంకులు నాలుగేనా?.. మెగా విలీనం దిశగా కేంద్రం అడుగులు!**

**సుప్రీంకోర్టు తీర్పు**

ఈ వివాదంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, 2022 నవంబర్ 4న కీలక తీర్పు ఇచ్చింది. ఉద్యోగులు, వారి యజమానులు సంయుక్తంగా (Joint Option) దరఖాస్తు చేసుకుంటే అధిక వేతనంపై (రూ.15,000 పరిమితిని పరిగణలోకి తీసుకోకుండా) పెన్షన్ ఫండ్‌కు వాటాలు చెల్లించడానికి అనుమతించాలని సుప్రీంకోర్టు EPFOను ఆదేశించింది. ఈ తీర్పు ద్వారా, గతంలో పరిమితి వల్ల తక్కువ పింఛను పొందుతున్న లేదా పొందబోతున్న ఉద్యోగులకు, అధిక వేతనంపై పూర్తి వాటా చెల్లించే అవకాశం లభించింది. దీంతో తమ పదవీ విరమణ తర్వాత మెరుగైన పెన్షన్ పొందేందుకు వీలు కలిగింది.

# అదానీ గ్రూప్‌లో LIC పెట్టుబడుల్లో మా జోక్యం లేదు: నిర్మలా సీతారామన్

దిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడుల విషయంలో తమ జోక్యం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. తమ శాఖ తరఫున ఎలాంటి సలహాలు గానీ, ఆదేశాలు గానీ ఇవ్వలేదని స్పష్టంచేశారు. పెట్టుబడుల విషయంలో ప్రామాణిక నిర్వహణ ప్రక్రియను అనుసరించి ఎల్ఐసీనే పెట్టుబడులపై నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ మేరకు లోక్‌సభలో ఆమె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడుల విషయంలో ఎల్ఐసీకి ఆర్థిక మంత్రిత్వశాఖ నుంచి ఆదేశాలు



వచ్చాయంటూ అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్ట్ అక్టోబర్ నెలలో ఓ కథనం వెలువరించింది. దీన్ని ఎల్ఐసీ తోసిపుచ్చింది. పెట్టుబడులు అనేవి తమ సొంత నిర్ణయమని పేర్కొంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ బదులిచ్చారు. ఎల్ఐసీ పెట్టుబడులపై సొంతంగా నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఐఆర్‌డీఏఐ, ఆర్‌బీఐ, సెబీ నిబంధనలు అనుసరించి ఈ పెట్టుబడులపై ఈ నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. ఎల్ఐసీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్టయిన టాప్ 500 కంపెనీల్లో ఎల్ఐసీకి పెట్టుబడులు ఉన్నాయని నిర్మలా సీతారామన్ అన్నారు. వీటిల్లో పెద్ద పెద్ద కంపెనీల్లో పెద్దమొత్తంలో పెట్టుబడులు ఉన్నాయని పేర్కొన్నారు. 2025 సెప్టెంబర్ 30 నాటికి నిఫ్టీ 50 కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబుల విలువ రూ.4.30 లక్షల కోట్లు అని, మొత్తం పెట్టుబడుల్లో 45.85 శాతం వాటాకు సమానమని పేర్కొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో రూ.40,901.38 కోట్లు, ఇన్ఫోసిస్‌లో రూ.38,846.33 కోట్లు, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో రూ.31,926.89 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రూ.31,664.69 కోట్లు, హిందుస్థాన్ యూనిలీవర్‌లో రూ.30,133 కోట్లు చొప్పున పెట్టుబడులు ఉన్నాయని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు అత్యధికంగా రూ.49,149.14 కోట్లు డెట్ రూపంలో ఇచ్చిందని పేర్కొన్నారు.

# సినిమా



## వెంకీ సినిమాపై బజ్

త్రివిక్రమ్ శ్రీనివాస్ , విక్టరి వెంకటేశ్ కాంబినేషన్‌లో వచ్చిన నువ్వు నాకు నచ్చావ్ , మల్లీశ్వరి వంటి మూవీస్ బ్లాక్ బస్టర్ అయిన విషయం తెలిసిందే. తాజాగా వారి కాంబినేషన్ లో వస్తున్న మూడో ప్రాజెక్టుపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమా టైటిల్ గురించి సోషల్ మీడియాలో రూమర్ వైరల్ నడుస్తోంది. అధికారికంగా ధృవీకరించనప్పటికీ 'బంధు మిత్రుల అభినందనలతో' టైటిల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అంతే కాదు. రెండో ఆప్షన్‌గా 'వెంకటరమణ కేరాఫ్ ఆనందనిలయం' టైటిల్ గురించి కూడా పుకార్లు వినిపిస్తున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి భాగమయ్యారని ఇప్పటికే వార్తలు కూడా వచ్చాయి. టైటిల్ చూస్తే ఇది పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని తెలుస్తోంది.



## యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న విలేజ్ కుకింగ్

తమిళనాడు కేంద్రంగా దక్షిణాది వంటకాల తయారీని వివరించే యూట్యూబ్ చానల్ విలేజ్ కుకింగ్ ఇది. వారు బహిరంగ ప్రదేశాలలో సంప్రదాయ గ్రామీణ వంటకాలను ఎలా తయారు చేయాలో చూపిస్తుంటారు. 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్‌లను కలిగి ఉంది. మొదటి డైమండ్ క్రియేటర్ అవార్డును అందుకున్న మొదటి తమిళ యూట్యూబ్ ఛానల్‌గా ఇది నిలిచింది .తమిళనాడులోని పుదుకోట్టై జిల్లా చిన్నవీరమంగళం గ్రామానికి చెందిన ఒక కుటుంబం ఈ చానల్ ను నిర్వహిస్తోంది. వీరిలో సోదరులు వి. సుబ్రమణియన్ (కెమెరా మెన్), వి. అయ్యనార్, వి. మురుగేసన్, వారి బంధువు టి. ముత్తుమాణికం, వారి బావమరిది జి. తమిళ్‌సెల్వన్ ఉన్నారు. వాళ్ల తాత, మాజీ చెఫ్ ఎం. పెరియతంబి వీరికి టీం లీడర్‌గా ఉన్నారు. తమిళ్‌సెల్వన్ 2018లో దీన్ని ప్రారంభించారు. పెద్దఎత్తున వంటలు చేస్తూ పోస్టు చేసేవారు. నెమ్మదిగా ఆదరణ పెరుగుతున్న క్రమంలో 2021 అసెంబ్లీ ఎన్నికల వేళ రాహుల్ గాంధీ ఛానల్ సభ్యులతో కలిసి వంట చేసిన వీడియో వైరల్‌గా మారి కోటి సబ్‌స్క్రైబర్లను పొందింది. తాజాగా 3 కోట్లు దాటింది. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ఫుడ్ వీడియోలను అప్‌లోడ్ చేసే ఛానళ్ల జాబితాలో నాల్గో స్థానంలో నిలిచింది.

## పెళ్లి చేసుకున్న సమంత–రాజ్

టాలీవుడ్ నటీమణి సమంత, దర్శకుడు రాజనిడమోరు ఇవాళ ఉదయం వివాహ బంధంలో ఒక్కటయ్యారు. కోయంబత్తూరు ఈషా ఫౌండేషన్ ఆవరణలో ఉన్న లింగభైరవీ ఆలయంలో వివాహం చేసుకున్నారు. వీళ్లిద్దరూ గత కొంత కాలంగా డేటింగ్ లో ఉన్నారు.ఈ విషయాన్ని ఇన్ స్టా గ్రాం వేదికంగా స్వయంగా సమంత ప్రకటించారు. నిడిమోరు దర్శకుడిగా, నిర్మాతగా దూసుకుపోతున్నాడు. అతడు డీ2ఆర్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ది ఫ్యామిలీ మ్యాన్, ఫర్జీ, గన్స్ & గులాబ్స్ సిరీస్‌లు నిర్మించాడు. రాజ్ నిడిమోరు స్వస్థలం ఏపీలోని తిరుపతి. కాగా సామ్, రాజ్‌కు మధ్య ఫ్యామిలీ మ్యాన్ 2 వెబ్ సిరీస్ నుంచి స్నేహం చిగురించింది. ఆ తర్వాత వీరి స్నేహం ప్రేమగా మారింది. సమంతతో విడిపోయాక ఇటీవలే నాగచైతన్య శోభితను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.

### హాట్ టాపిక్‌గా శ్యామలి వ్యాఖ్యలు

పెళ్లి విషయంపై సమంత గానీ, రాజ్ గానీ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. రాజ్ నిడిమోరు మాజీ భార్య శ్యామలి సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్య అగ్నికి ఆజ్యం పోసినట్టుగా మారింది. "తెగించిన వ్యక్తులు అలాంటి పనులే చేస్తారు" అని ఆమె పెట్టిన పోస్ట్ చుట్టూ భారీ చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో సమంత - రాజ్ పెళ్లి వార్తలపై మరింత సందేహాలు, ఊహాగానాలు మొదలయ్యాయి.





## సినిమాలను అలా అంచనా వేయడం దురదృష్టకరం


: ఆమిర్ ఖాన్



బాక్సాఫీస్ నంబర్ల ఆధారంగా సినిమా ఫలితాన్ని అంచనా వేయడం దురదృష్టకరమని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్ అన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని, ఇప్పుడు ఆ నంబర్లకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు సినిమాల్లోని సన్నివేశాలు, పాటల ఆధారంగా బాగుందా లేదా? అని నిర్ణయించేవారని గుర్తుచేశారు. ''బాక్సాఫీస్ నంబర్ల విషయంలో దర్శకనిర్మాతలు పారదర్శకత పాటించాలి. ఎన్ని స్క్రీన్‌లలో రిలీజ్ చేశారు.. ఎంత కలెక్షన్లు వచ్చాయనే ప్రతి విషయం ప్రేక్షకులకు తెలియాలి. విదేశాల్లో అలాంటి పద్ధతే ఉంది. గతంలో నేను వీటి గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. కానీ, ఇప్పుడు ప్రేక్షకులకు దీనిపై ఆసక్తి పెరిగింది కాబట్టి నేను కూడా ఆలోచిస్తున్నా. నంబర్ల ఆధారంగా సినిమా ఫలితాలను అంచనా వేయడం మాత్రం దురదృష్టకరం. అంచనాలు ఎలా ఉన్నప్పటికీ మంచి సినిమాలను మాత్రమే ప్రేక్షకులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు'' అని ఆమిర్ స్పష్టం చేశారు. ఇక ఇటీవల మరణించిన బాలీవుడ్ హీరో ధర్మేంద్రతో ఉన్న అనుబంధాన్ని ఆమిర్ గుర్తుచేసుకున్నారు. ఆయనను కలవడం తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని క్షణమని చెప్పారు. తన చిన్న కుమారుడిని కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు.

## పెళ్లి చేసుకోవాలని నేను సలహా ఇవ్వను :

ఇంటర్నెట్ డెస్క్: ప్రస్తుతం ఉన్న జనరేషన్‌కు తాను వివాహం గురించి సలహాలు ఇవ్వబోనని నటి జయా బచ్చన్ అన్నారు. జీవితాన్ని ఆస్వాదించాలని వారికి చెబుతానన్నారు. సినీ, రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేసుకున్న జయా బచ్చన్



తాజాగా ఈతరం పిల్లల గురించి 'వి ది విమెన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. తన మనవరాలు నవ్య నవేలి నందా వివాహం గురించి మాట్లాడారు. ''నవ్య ఇప్పుడే పెళ్లి చేసుకోవడం నాకు ఇష్టం లేదు. జీవితాన్ని పూర్తిగా ఆస్వాదించాలని చెబుతాను. ఆమెకు మరికొన్నిరోజుల్లో 28 సంవత్సరాలు నిండుతాయి. నేటి తరం పిల్లలకు మనం సలహాలు ఇవ్వలేం. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. చిన్నపిల్లలు చాలా తెలివైన వారు. అన్ని విషయాల్లో మనల్ని మించిపోయారు. ఇక, వివాహం అంటే ఇలానే ఉండాలి అని చట్టబద్ధమైన నిర్వచనాలు లేవు. అలా నిర్వచించాల్సిన అవసరం కూడా లేదు. ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడుండాలంతే'' అని జయా బచ్చన్ తెలిపారు. అమితాబ్‌జయా బచ్చన్ మనవరాలు నవ్యకు సోషల్‌మీడియాలో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమె సినిమాల్లోకి వచ్చే అవకాశం ఉందని ఇప్పటికే పలు సందర్భాల్లో వార్తలు రాగా.. అందులో నిజం లేదని, తనకు యాక్టింగ్ అంటే ఇష్టం లేదని నవ్య ఓ సందర్భంలో స్పష్టం చేశారు. తన స్నేహితులతో కలిసి 'ఆరా హెల్త్' అనే ఆన్‌లైన్ హెల్త్‌కేర్ పోర్టల్‌ను ప్రారంభించారు. మహిళల కోసం ప్రత్యేకంగా ప్రారంభించిన ఈ ఆన్‌లైన్ వేదికగా ఎన్నో శారీరక, మానసిక రుగ్మతలకు పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తున్నారు.


## అప్పుడు ధనుష్.. ఇప్పుడు శ్రేయస్ అయ్యర్..

### డేటింగ్ రూమర్స్‌పై స్పందించిన మృణాల్

టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ (Shreyas Iyer)తో తాను డేటింగ్‌లో ఉన్నట్లు వచ్చిన రూమర్స్‌పై మృణాల్ ఠాకూర్ (Mrunal Thakur) స్పందించారు. 'ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ సోషల్ మీడియా వేదికగా తనపై జరిగిన ప్రచారానికి చెక్ పెట్టారు. ఇంతకుముందు.. నటుడు ధనుష్ (Dhanush)తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ అప్పుడే ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. మృణాల్‌పై రూమర్స్ రావడం ఇదే తొలిసారి కాదు. ఓ టాలీవుడ్ నటుడిని మృణాల్ వివాహం చేసుకోనున్నారంటూ కొంతకాలం క్రితం నెట్టింట చర్చ జరిగింది. తన మూవీ (జెర్సీ హిందీ రీమేక్) ప్రమోషన్స్‌లో మాట్లాడుతూ ఓ ప్రముఖ క్రికెటర్‌పై అభిమానం వ్యక్తం చేయగా.. ఆ క్రీడాకారుడితో ఆమెకు రిలేషన్‌షిప్ ఉన్నట్లు జాతీయ మీడియాలో వార్తలు రావడం గమనార్హం. సినిమాల విషయానికొస్తే.. 'సన్నాఫ్ సర్దార్ 2'తో ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకొచ్చారు మృణాల్. బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటున్నారు. 'దో దీవానే శహర్ మే' సహా మరో రెండు హిందీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో అడివి శేష్ సరసన నటిస్తున్న 'డెకాయిట్' హిందీలోనూ విడుదల కానుంది. అల్లు అర్జున్- అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమాలో ఓ హీరోయిన్‌గా మృణాల్ ఎంపికైనట్లు వార్తలొచ్చాయి. దీనిపై అధికారిక ప్రకటన లేదు.



# సోగ కళ్ల సొగసు కోసం..!



**కళ్లకి కాటుక... వింజామరలాంటి కనురెప్పలు... వంపులు తిరిగిన కనుబొమలు... ఇవేనా ఇంకెన్నో సొగసులు అద్దితేగానీ... కళ్ల మేకప్ పూర్తవదు. అందం సంపూర్ణమవదు. నిజానికి ముఖం అందం పెంచేది కళ్లే అని భావిస్తారు అమ్మాయిలు. కాబట్టే, ఎంత మేకప్‌కి దూరంగా ఉండేవారైనా కళ్ల సింగారాన్ని మాత్రం కాదనరు. దాన్ని సులువు చేసేవి ఇవి...**

**ఇదొక్కటి చాలు...**

కాటుక కన్ను దాటొద్దు, మస్కారా కంటి చుట్టుపక్కల అంటొద్దు... ఐలైనర్ తీరుగా రావాలి. అప్పుడేగా అందమైన కళ్లూ సాధ్యం. అలా కావాలంటే ఈ మల్టీఫంక్షనల్ ఐ మేకప్ టూల్ కావాల్సిందే! ఇది లిప్‌లైనర్, లిప్‌స్టిక్ నచ్చినట్లుగా తీర్చిదిద్దుకోవడానికీ సాయపడుతుంది. ఇంకా కంటైనర్‌లో చివరికి చేరిన క్రీమ్‌ని తీసుకోవడానికీ దీనికింది భాగం స్పూన్‌లా ఉపయోగపడుతుంది.


**అతికించేయండి**

కనుమూలల్లో వంపులు తిరుగుతూ సోగకళ్లను మరింత పెద్దవిగా చేస్తూ తీర్చిదిద్దే ఐలైనర్ అంటే ప్రతి అమ్మాయికీ ప్రేమే. సమస్యల్లా ఆ వంపు తిప్పడమే! ఈ క్రమంలో ఎన్నెన్నిసార్లు తుడిచి మళ్లీ వేయాలో! ఈ ఇబ్బంది అంతా వద్దు అనుకుంటే ఈ ఐలైనర్ స్టిక్కర్స్‌ని తెచ్చేసుకోండి. కావాల్సినప్పుడల్లా అతికించేసుకుని తిరిగి తీసేయడమే. వాటర్ ప్రూఫ్. తొలగించడమూ సులువే. ముఖ్యంగా తిరిగి వాడుకోవచ్చు. నలుపే కాదు... భిన్న రంగుల్లోనూ దొరుకుతున్నాయి.

**నచ్చినట్టుగా సిద్ధమైపోవచ్చు**

ఫిష్‌టెయిల్, థిక్ వింగ్, ఆల్ రౌండ్ వింగ్, క్యాట్ వింగ్... ఐలైనర్ లుక్‌లూ బోలెడు. సంప్రదాయ వస్త్రాలు, పార్టీ, వేడుక ఒక్కోదాన్ని బట్టి దీన్నీ మారుస్తుంటారు అమ్మాయిలు. అప్పుడే ప్రత్యేకత. కానీ దాన్ని తీర్చిదిద్దడంలోనే సగం సమయం అయిపోతుంది. అది తగ్గాలంటే ఈ ఐలైనర్ ఐషాడో స్టెన్సిల్స్ తెచ్చుకోండి. నచ్చిన ఐలైనర్ వేశాక... దానికి తగ్గట్టుగా ఐషాడో ఏమేరకు వేయాలో తెలిపే స్టెన్సిల్స్ కూడా ఉంటాయి. వాటిని అనుసరిస్తూ వేసుకోండి. నిమిషాల్లో అందమైన కళ్లు సొంతం. ఇంకేం... వీటిలో మీకు అనువైనవేవో ఎంచుకుని తెచ్చేసుకోండి. వేడుకల్లో మెరిసిపోండి మరి!











## ముద్ద నందివర్ధనం.. మురిపిస్తోంది!

ఈ నందివర్ధనం అపోసినేసియా కుటుంబానికి చెందిన మొక్క. ఇందులోనే ముద్ద రేకల రకమూ ఒకటి. ప్రాంతాన్ని బట్టి చాందినీ, తగర్, పంచ కర్పూర పువ్వు, చంద్రమణి వంటి పేర్లతోనూ పిలుస్తారు. ఇది పొదలా గుబురుగా పెరుగుతుంది. మనం కోరుకున్న ఎత్తులో కత్తిరింపుల ద్వారా నియంత్రించుకోవచ్చు. నిగనిగలాడే పచ్చటి ఆకులు, మెత్తగా మందమైన పొరల్లో పూసే పూలు, హాయినిచ్చే సువాసనతో ప్రత్యేక గుర్తింపు అందుకున్న ఈ మొక్కకు ఔషధ గుణాలూ ఎక్కువేనట. అందుకే, ప్రాచీన కాలం నుంచీ ఆయుర్వేదంలో వాడుతున్నారు. ఇది మన దేశంతోపాటు శ్రీలంక, దక్షిణ చైనాలోనూ ఎక్కువగా కనిపిస్తుంది. సంరక్షణ ఇలా... నందివర్ధనం మొక్క ఆరోగ్యంగా ఎదగాలంటే... దానికి కనీసం నాలుగైదు గంటలైనా సూర్యకాంతి అందేలా చూసుకోవాలి. కుండీల్లో పెంచుకోవాలనుకుంటే... నీరు నిలవని సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. తొట్టె కూడా కాస్త పెద్ద పరిమాణంలో ఉన్నదే వాడండి. నీళ్లు ఎక్కువైతే మొక్క దెబ్బతినే అవకాశం ఉంది. తేమ లేదనుకున్నాకే తడి అందించండి. పోషకాలు సరిగా అందితే పూలూ బాగా పూస్తుందీ మొక్క. ఎక్కువ రోజులూ తాజాగా ఉంటుంది. అందుకే, రెండు మూడు వారాలకోసారి పొటాషియం మోతాదు ఎక్కువ ఉండే ఎన్‌పీకే సమగ్ర ఎరువుని క్రమం తప్పకుండా అందించాలి. కొమ్మ కత్తిరింపులు, విత్తనాల ద్వారా కొత్త మొక్కల్ని మొలకెత్తించవచ్చు. పూత పూయడం ఆగిపోయాక 40 శాతం వరకూ కొమ్మల్ని కత్తిరించుకోవాలి. అఫిడ్స్, మిలీబగ్స్, ఎర్ర సాలీడు, ఆకు ముడతతో పాటు వేరు కుళ్లు తెగులూ వచ్చే అవకాశం ఉంది. వీటిని నివారించడానికి లీటరు నీటిలో సబ్బు ద్రావణం, పది గ్రాముల వెల్లుల్లి పేస్టు, కాస్త వంటనూనె కలిపి సాయంత్రం పూట స్ప్రే చేస్తే సరి.





## కుంకుడు కాయలు.. ఇలా కూడా..!



**ఒకప్పుడు తలస్నానం చేయడానికి కుంకుడు కాయలనే ఉపయోగించేవారు. అయితే మార్కెట్లోకి షాంపూలు అందుబాటులోకి వచ్చాక వాటి వాడకం బాగా తగ్గిపోయింది. అయితే కేవలం జుట్టును శుభ్రపరచుకోవడానికే కాకుండా ఇంట్లో ఇతరత్రా పనులకు కూడా కుంకుడు కాయల్ని ఉపయోగించుకోవచ్చంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి..**



**లిక్విడ్ సోప్‌గా..**

కప్పు నీటిలో రెండు కుంకుడు కాయలు వేసి అరగంట పాటు మరగబెట్టాలి. ఆ తర్వాత పూర్తిగా చల్లారనిచ్చి వడకట్టుకోవాలి. దీనికి మీకు నచ్చిన ఫ్లేవర్ అరోమా ఆయిల్‌ని కొన్ని చుక్కలు వేసి కలుపుకోవాలి. అనంతరం శుభ్రంగా కడిగి పొడిగా ఆరబెట్టుకున్న బాటిల్‌లో ఈ మిశ్రమాన్ని పోసి ఫ్రిజ్‌లో నిల్వ చేసుకోవాలి. దీన్ని స్నానం చేసేటప్పుడు సబ్బుకి బదులుగా ఉపయోగించవచ్చంటున్నారు నిపుణులు.

**గ్లాస్ క్లీనర్‌గా..**

కిటికీల అద్దాలను తుడవడానికి సాధారణంగా మార్కెట్లో దొరికే క్లీనింగ్ లిక్విడ్‌లను ఉపయోగిస్తాం. అయితే వీటికి బదులుగా కుంకుడు కాయలను ఉపయోగించి కూడా ఇంట్లోనే గ్లాస్‌క్లీనర్‌ను తయారు చేసుకోవచ్చు. దీనికోసం కుంకుడు కాయలతో తయారుచేసుకున్న లిక్విడ్ సోప్ ఒక టేబుల్ స్పూన్, రెండు టేబుల్ స్పూన్ల వైట్ వెనిగర్, అరకప్పు నీటిని తీసుకొని బాగా కలుపుకోవాలి. దీన్ని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి బాగా షేక్ చేయాలి. అనంతరం దీన్ని కిటికీ అద్దంపై స్ప్రే చేసి మెత్తటి వస్త్రంతో తుడిచేయాలి. ఇలా చేస్తే కిటికీ అద్దాలపై పేరుకున్న దుమ్ము తొలగిపోయి అవి కొత్త వాటిలా మెరుస్తాయట.

**పట్టు వస్త్రాలకు..**

పట్టు, జరీ దుస్తుల్ని ఉతకడానికి కుంకుడు కాయలు చక్కటి ప్రత్యామ్నాయం. దీనికోసం కొన్ని కుంకుడు కాయలను చల్లటి నీటిలో నానబెట్టి వాటి రసాన్ని తీయాలి. ఈ మిశ్రమంతో పట్టు, జరీ వస్త్రాలను ఉతికితే అవి ఎక్కువ కాలం మన్నడంతో పాటు రంగు వెలిసిపోకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. అంటే పట్టు, ఇతర సున్నితమైన వస్త్రాల్ని మనం ఎలాగైతే షాంపూ వాష్ చేస్తామో.. ఆ షాంపూ బదులుగా ఈ సహజసిద్ధమైన షాంపూను ఉపయోగించచ్చన్నమాట!

**కిచెన్ క్లీనర్‌గా..**

అరకప్పు కుంకుడుకాయ రసానికి రెండు చెంచాల వైట్ వెనిగర్, కొద్దిగా నీళ్లు కలపాలి. ఈ మిశ్రమాన్ని స్ప్రే బాటిల్‌లో పోసి బాగా షేక్ చేసుకోవాలి. దీంతో కిచెన్ ప్లాట్‌ఫాం, వాష్‌బేసిన్ లాంటివి శుభ్రం చేసుకోవచ్చు. అలాగే దీన్ని బాత్‌రూం క్లీనర్‌గా కూడా ఉపయోగించవచ్చు.





# తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి రికార్డు స్థాయిలో స్పందన

తిరుమల, , డిసెంబర్ 1 (భారత శక్తి): శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి భక్తుల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ ఏడాది డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు పది రోజుల పాటు జరిగే దర్శనాల కోసం 24 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) జారీ చేసిన 1.80 లక్షల టోకెన్లకు గాను, ఏకంగా 24,05,237 మంది భక్తులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. ఇది వైకుంఠ ద్వార దర్శనంపై భక్తులకు ఉన్న అపారమైన భక్తివిశ్వాసాలకు నిదర్శనంగా నిలుస్తోంది. అత్యంత కీలకమైన వైకుంఠ ఏకాదశి (డిసెంబర్ 30), ద్వాదశి (డిసెంబర్ 31), నూతన సంవత్సరం (జనవరి 1) రోజులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగిసిందని టీటీడీ అధికారులు తెలిపారు. ఈ మూడు రోజులకు గాను 9.6 లక్షల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. ఈ టోకెన్లను డిసెంబర్ 2న ఎలక్ట్రానిక్ డిప్ (లాటరీ) పద్ధతిలో భక్తులకు కేటాయించనున్నారు. అత్యధికంగా టీటీడీ మొబైల్ యాప్ ద్వారా 13.4 లక్షల మంది, వెబ్‌సైట్ ద్వారా 9.3 లక్షల మంది, ఏపీ ప్రభుత్వ వాట్సాప్ సేవ ద్వారా 1.5 లక్షల మంది నమోదు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక మిగిలిన ఏడు రోజులకు (జనవరి 2 నుంచి 8 వరకు) సంబంధించిన సర్వదర్శనం యథావిధిగా కొనసాగుతుంది. ఈ తేదీలకు గాను రోజుకు 15 వేల చొప్పున రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లను, వెయ్యి శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను డిసెంబర్ 5న ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. స్థానికుల కోసం జనవరి 6, 7, 8 తేదీలకు రోజుకు 5 వేల చొప్పున టోకెన్లను డిసెంబర్ 10న అందుబాటులో ఉంచుతారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ, ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ స్పష్టం చేసింది.

## తిరుపతిలోని హోటళ్లకు బాంబు బెదిరింపులు...

తిరుపతి, డిసెంబర్ 1 (భారత శక్తి): ప్రముఖ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. నగరంలోని పలు హోటళ్లను లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు ఈమెయిల్స్ ద్వారా హెచ్చరికలు పంపారు. దీంతో హోటళ్ల యాజమాన్యాలు తీవ్ర ఆందోళనకు గురై వెంటనే పోలీసులకు సమాచారం అందించాయి. వివరాల్లోకి వెళితే, తిరుపతిలోని కపిలతీర్థం సమీపంలో ఉన్న రెండు హోటళ్లకు బాంబు పెట్టినట్లు బెదిరింపు మెయిల్స్ అందాయి. ఈ సమాచారం అందుకున్న హోటళ్ల నిర్వాహకులు అప్రమత్తమై పోలీసులను ఆశ్రయించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో ఆయా హోటళ్లకు చేరుకున్నారు. అక్కడ తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులను ప్రశ్నించారు. అయితే, అక్కడ ఎలాంటి బాంబులు లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కొన్ని రోజుల క్రితమే తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కార్యాలయం, రైల్వే స్టేషన్‌కు కూడా ఇలాగే ఈమెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు రావడం గమనార్హం. అప్పుడు కూడా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇప్పుడు మళ్లీ హోటళ్లను లక్ష్యంగా చేసుకోవడంతో ఇది ఆకతాయిల పనే అని పోలీసులు అనుమానిస్తున్నారు. వరుస ఘటనల నేపథ్యంలో ఈ మెయిల్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయనే దానిపై పోలీసులు దృష్టి సారించారు.

## హైదరాబాద్ మెట్రోలో సెక్యూరిటీ గార్డులుగా 20 మంది ట్రాన్స్‌జెండర్లు

హైదరాబాద్, డిసెంబర్ 1 (భారత శక్తి): హైదరాబాద్ మెట్రో రైల్ సామాజిక సమ్మిళితత్వం దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుంది. సమాజంలో సమాన అవకాశాలు కల్పించే లక్ష్యంతో 20 మంది ట్రాన్స్‌జెండర్లను భద్రతా సిబ్బందిగా నియమించింది. ప్రత్యేక శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వీరంతా సోమవారం నుంచి ఎంపిక చేసిన మెట్రో స్టేషన్లు, రైళ్లలో తమ విధులను ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వ సమ్మిళిత విధానాలు, అణగారిన వర్గాల సాధికారతకు అనుగుణంగా ఈ నియామకాలు చేపట్టినట్లు హైదరాబాద్ మెట్రో యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతిరోజూ సుమారు 5 లక్షల మంది ప్రయాణించే హైదరాబాద్ మెట్రోలో దాదాపు 30 శాతం మంది మహిళలే ఉంటారు. వారి భద్రత, సౌకర్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ నియామకాలతో భద్రతా వ్యవస్థ మరింత పటిష్టం అవుతుందని యాజమాన్యం విశ్వాసం వ్యక్తం చేసింది. కొత్తగా విధుల్లో చేరిన ఈ సిబ్బంది మెట్రో స్టేషన్లలోని సాధారణ ప్రాంతాలతో పాటు, ప్రత్యేకంగా మహిళల కోసం కేటాయించిన కోచ్‌లలో భద్రతను పర్యవేక్షిస్తారు. ప్రయాణికులకు సమాచారం అందించడం, దిశానిర్దేశం చేయడం, బ్యాగేజ్ స్కానర్ల వద్ద పర్యవేక్షణ వంటి బాధ్యతలను నిర్వర్తిస్తారు. ఈ చొరవ ద్వారా అణగారిన వర్గాలకు ఉపాధి కల్పించడంతో పాటు, ప్రయాణికులకు సురక్షితమైన వాతావరణాన్ని అందించడమే ముఖ్య ఉద్దేశమని హైదరాబాద్ మెట్రో స్పష్టం చేసింది. ఈ నిర్ణయం సామాజిక సాధికారతకు ఒక బలమైన సంకేతమని, మెట్రో వ్యవస్థపై మహిళల భద్రత, ప్రజల విశ్వాసాన్ని పెంచే దిశగా వేసిన కీలక అడుగు అని పేర్కొంది.

## ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు..

ఢిల్లీ, డిసెంబర్ 1 (భారత శక్తి): పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యాయి. లోక్‌సభ, రాజ్యసభ సమావేశమైన వెంటనే, ఇటీవల మరణించిన సభ్యులకు ఉభయ సభలు సంతాపం ప్రకటించాయి. ఈ సమావేశాల్లో 14 కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవ్వగా, పలు ప్రజా సమస్యలపై అధికార పక్షాన్ని నిలదీసేందుకు విపక్షాలు వ్యూహాలు సిద్ధం చేశాయి. ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్, ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటు, అణు ఇంధనం, కార్పొరేట్, బీమా, జాతీయ రహదారుల సవరణ వంటి ముఖ్యమైన బిల్లులను సభ ముందుకు తీసుకురానుంది. వీటి ద్వారా పలు సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు, కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు, ఢిల్లీలో జరిగిన పేలుడు, జాతీయ భద్రత, పెరుగుతున్న కాలుష్యం, రైతులకు కనీస మద్దతు ధర వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. ఈ క్రమంలో, ఓటర్ల జాబితా సవరణపై చర్చించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టింది. కాగా, కొత్త ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్ అధ్యక్షతన రాజ్యసభ సమావేశాలు జరగడం ఇదే తొలిసారి. డిసెంబర్ 19 వరకు జరగనున్న ఈ సమావేశాలు మొత్తం 15 రోజుల పాటు కొనసాగుతాయి.

## శ్రీకాకుళం జిల్లాలో డయేరియా కేసులు..

శ్రీకాకుళం, డిసెంబర్ 1 (భారత శక్తి): శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాళి మండలం, తాళ్లవలస గ్రామంలో డయేరియా కేసులు నమోదు కావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. గ్రామంలోని పరిస్థితిని వైద్యారోగ్య శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. తాళ్లవలస గ్రామంలో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం వరకు ఆరుగురు వ్యక్తులు అస్వస్థతకు గురవగా వారిని టెక్కలి ఆసుపత్రికి తరలించామని చెప్పారు. సోమవారం మరో ముగ్గురు ఆసుపత్రిలో చేరినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. బాధితులంతా వేర్వేరు కుటుంబాలకు చెందినవారని, ప్రస్తుతం ఆసుపత్రిలో ఐదుగురు చికిత్స తీసుకుంటున్నారని, వారు కోలుకుంటున్నారని తెలిపారు. ఇందులో ముగ్గురు డిశ్చార్జ్ అయినట్లు వెల్లడించారు. చిన్నారావు (70) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. చిన్నారావు మృతికి డయేరియా కారణం కాదని వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు. చిన్నారావు మూత్రపిండాల వ్యాధితో బాధపడేవాడని, మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ వల్ల గుండెపోటు వచ్చి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో ఒక బావి ద్వారా 5 పబ్లిక్ కుళాయిలకు, మరో 2 చేతి పంపుల ద్వారా నీటి సరఫరా జరుగుతోందని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా ఈ నీటిని పరీక్షించగా ఎక్కడా కలుషితం లేదని, నీరు తాగడానికి సురక్షితమేనని తేలిందని అధికారులు చెప్పారు. అయినప్పటికీ, ముందు జాగ్రత్త చర్యగా బావి నుంచి నీటి సరఫరాను నిలిపివేశామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి, ఎస్ఈ (ఆర్‌డబ్ల్యూఎస్) క్షేత్రస్థాయిలోనే ఉండి పారిశుద్ధ్యం, నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. డయేరియా ప్రబలడానికి గల అసలు కారణాన్ని కనుగొనేందుకు డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఎపిడెమియాలజిస్ట్ గ్రామంలోనే ఉండి పరిశీలిస్తున్నారని అధికారులు తెలిపారు. వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహిస్తున్నాయని అధికారులు తమ నివేదికలో పేర్కొన్నారు. తాళ్లవలస గ్రామస్థులు ఎందుకు అనారోగ్యం పాలవుతున్నారో గుర్తించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గ్రామస్థులకు సరఫరా అయ్యే నీటిలో ఎక్కడైనా మలినాలు కలుస్తున్నాయా లేక ఇతర కారణాలా అనేది విశ్లేషించాలని సూచించారు. గ్రామస్థులందరికీ సురక్షితమైన మంచినీరు అందించేలా చర్యలు తీసుకోవడంతోపాటు సమీప గ్రామాలపైనా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



## తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరుకండి

హైదరాబాద్ , డిసెంబర్ 1 (భారత శక్తి): హైదరాబాద్‌లో నిర్వహించిన 'బీటీ గోల్ఫ్ హైదరాబాద్ 2025-26' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, పారిశ్రామికవేత్తలకు కీలక ఆహ్వానం పలికారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దార్శనికతలో భాగంగా, డిసెంబర్ 8, 9 తేదీల్లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు పరిశ్రమల అధినేతలు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా అజారుద్దీన్ మాట్లాడుతూ.. బీటీ గోల్ఫ్ ఈవెంట్ ప్రతిభ, స్నేహభావం, వ్యాపార సంబంధాలను పెంపొందించడానికి ఒక అద్భుతమైన వేదిక అని ప్రశంసించారు. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారందరికీ ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని అజారుద్దీన్ వివరించారు. ఈ సదస్సు రాష్ట్ర అభివృద్ధిలో ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.



## మరో కేసులో బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు జైలు శిక్ష

బంగ్లాదేశ్, డిసెంబర్ 1 (భారత శక్తి): బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు మరో అవినీతి కేసులో ఎదురుదెబ్బ తగిలింది. పూర్బాచల్ న్యూ టౌన్ ప్రాజెక్టులో భూముల కేటాయింపులో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఢాకాలోని ప్రత్యేక కోర్టు ఆమెకు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. సోమవారం ఈ సంచలన తీర్పును వెలువరించింది. ఇదే కేసులో హసీనా సోదరి షేక్ రెహానాకు ఏడేళ్లు, ఆమె మేనకోడలు, బ్రిటిష్ ఎంపీ తులిప్ సిద్ధిఖీకి రెండేళ్ల జైలు శిక్షను కోర్టు ఖరారు చేసింది. ఢాకా స్పెషల్ జడ్జి కోర్టు 4 న్యాయమూర్తి ఎండీ రబియుల్ ఆలం ఈ తీర్పును ప్రకటించారు. నిందితులు ముగ్గురూ కోర్టుకు హాజరు కాలేదు. కేసులో మరో 14 మంది నిందితులకు కూడా తలా ఐదేళ్ల జైలు శిక్ష పడింది. దోషులైన 17 మందికి లక్ష బంగ్లాదేశ్ టాకాల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. బంగ్లాదేశ్ అవినీతి నిరోధక కమిషన్ (ఏసీసీ) ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై మొత్తం ఆరు కేసులు దాఖలు చేసింది. కాగా, ఇదే తరహా అవినీతి ఆరోపణలపై గత నవంబర్ 27న కూడా మరో కోర్టు హసీనాకు 21 ఏళ్ల జైలు శిక్ష విధించింది. అటు, అల్లర్ల సందర్భంగా మానవత్వానికి వ్యతిరేకంగా ఆదేశాలు ఇచ్చి వందలాది మరణాలకు కారణమయ్యారన్న కేసులో ఆమెకు మరణశిక్ష విధించడం తెలిసిందే. తాజా తీర్పుపై షేక్ హసీనా కుటుంబ సభ్యులు తీవ్రంగా స్పందించారు. తమపై మోపిన అవినీతి ఆరోపణలన్నీ నిరాధారమైనవని, రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని ఓ ప్రకటనలో ఖండించారు. "మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ఏసీసీని నియంత్రిస్తోంది. పక్షపాత సాక్ష్యాలతో మమ్మల్ని ఇరికించాలని చూస్తున్నారు. కనీసం మా వాదన వినిపించే అవకాశం కూడా ఇవ్వలేదు" అని వారు ఆరోపించారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీ కూడా ఈ కేసులను రాజకీయ కక్ష సాధింపు చర్యలుగా అభివర్ణించింది.

### సభలో డ్రామాలు వద్దు... పార్లమెంటు శీతాకాల సమావేశాలకు

## ముందు విపక్షాలకు ప్రధాని మోదీ హితవు

ఢిల్లీ, డిసెంబర్ 1 (భారత శక్తి): పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సభలో డ్రామాలు వద్దని, దేశానికి అవసరమైన 'డెలివరీ' (ఫలితాలు) పైనే దృష్టి పెట్టాలని సోమవారం స్పష్టం చేశారు. నినాదాలు చేయడానికి బయట చాలా వేదికలు ఉన్నాయని, పార్లమెంటును మాత్రం విధాన రూపకల్పనకు పరిమితం చేయాలని ఆయన గట్టిగా సూచించారు. సమావేశాల ప్రారంభానికి ముందు మీడియా ఎదుట మాట్లాడిన ప్రధాని, ఫలవంతమైన చర్చలు జరగాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. ఈ శీతాకాల సమావేశాలు కేవలం ఒక సంప్రదాయం కాదని, దేశాన్ని శరవేగంతో ప్రగతి పథంలో నడిపించే ప్రయత్నాలకు కొత్త శక్తినిచ్చే మార్గమని ప్రధాని అన్నారు. "భారతదేశం ప్రజాస్వామ్య స్ఫూర్తితో జీవిస్తోంది. ఇటీవలి బీహార్ ఎన్నికల్లో భారీగా పోలైన ఓటింగ్, ముఖ్యంగా మహిళల భాగస్వామ్యం పెరగడం ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని బలపరిచింది. ప్రజాస్వామ్యం ద్వారా ఫలితాలు సాధించగలమని భారత్ నిరూపించింది. ప్రపంచం మన ప్రజాస్వామ్య, ఆర్థిక వ్యవస్థల బలాన్ని నిశితంగా గమనిస్తోంది" అని ఆయన వివరించారు. విపక్షాల వైఖరిని ప్రధాని తీవ్రంగా తప్పుబట్టారు. "దేశం కోసం పార్లమెంటు ఏం ఆలోచిస్తోంది, ఏం చేయాలనుకుంటోంది అనే దానిపై ఈ సమావేశాల్లో దృష్టి సారించాలి. ఇటీవలి ఎన్నికల ఓటమి బాధ నుంచి విపక్షాలు బయటకు వచ్చి, తమ బాధ్యతను నిర్వర్తించాలి. కానీ దురదృష్టవశాత్తూ కొన్ని రాజకీయ పార్టీలు తమ ఓటమిని అంగీకరించలేకపోతున్నాయి" అని మోదీ విమర్శించారు. బీహార్ ఎన్నికలు ముగిసి రోజులు గడిచినా, వారి మాటలు వింటుంటే ఓటమి బాధ ఇంకా వదిలినట్టు లేదని ఆయన ఎద్దేవా చేశారు. సభలో కొత్తగా ఎన్నికైన, యువ ఎంపీలకు మాట్లాడే అవకాశం లభించడం లేదని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "తొలిసారి ఎన్నికైన వారు, యువతరం ఎంపీలు సభలో మాట్లాడలేకపోతున్నారు. తమ ప్రాంత సమస్యలను వినిపించలేకపోతున్నారు. దేశాభివృద్ధికి అనుకూలంగా మాట్లాడినా వారిని అడ్డుకుంటున్నారు. వారికి అవకాశం కల్పించడం మనందరి బాధ్యత" అని ఆయన అన్నారు. "డ్రామాలు చేయడానికి చాలా చోట్లున్నాయి, ఎవరైనా అక్కడ చేసుకోవచ్చు. కానీ ఇక్కడ జరగాల్సింది డెలివరీ, డ్రామా కాదు. నినాదాలు చేయడానికి దేశం మొత్తం ఉంది. ఎక్కడ ఓడిపోయారో అక్కడ నినాదాలు చేశారు, రేపు ఎక్కడ ఓడిపోతారో అక్కడ కూడా చేయొచ్చు. కానీ పార్లమెంటులో మాత్రం విధానాలపైనే దృష్టి పెట్టాలి" అని ప్రధాని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాజకీయాల్లో నెగిటివిటీ పనికొస్తుందేమో గానీ, దేశ నిర్మాణానికి సానుకూల దృక్పథమే అవసరమని ఆయన హితవు పలికారు. కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు ప్రజా వ్యతిరేకత కారణంగా సొంత రాష్ట్రాల్లో పర్యటించలేని స్థితిలో ఉన్నాయని, అలాంటి పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

# ఎయిడ్స్ వ్యాధి యొక్క ప్రమాదం ఇంకా ఉంది జాగ్రత్త.!

* **ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ర్యాలీని ప్రారంభించిన**
* **డాక్టర్ వి. విజయలక్ష్మి**
* **డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ**

షాద్ నగర్,డిసెంబర్ , 01 (భారత శక్తి) : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబర్ 1న నిర్వహిస్తారు. సోమవారం షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి జండా ఊపి ప్రారంభించారు. తదుపరి హెల్త్ ఎడ్యుకేటర్ జే. శ్రీనివాసులు ఎయిడ్స్ ర్యాలీ యొక్క స్లోగన్లు చెబుతూ ర్యాలీని షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి చౌరస్తా దాకా వెళ్లారు.వ్యాధి గురించి నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. షాద్నగర్ చౌరస్తాలో మానవహారం చేసి ఎయిడ్స్ వ్యాధి గురించి డాక్టర్ వి విజయలక్ష్మి డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ మాట్లాడారు. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం హెచ్ఐవి /ఎయిడ్స్ మహమ్మారి గురించి అవగాహన పెంచడం, దాని వ్యాప్తిని అరికట్టడం. ఈ వ్యాధితో మరణించిన వారిని స్మరించుకోవడం, హెచ్ఐవి ఉన్నవారికి మద్దతు ఇవ్వడమని డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు.

**ముఖ్యాంశాలు**

ఈ దినోత్సవాన్ని మొదటిసారిగా 1988లో పాటించారు. ఇది తొలి అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవంలో ఒకటిగా నిలిచింది.

ఎయిడ్స్ అంటే ఏమిటి.? అక్వైర్డ్ యుమినో




డిఫిసియన్సీ సిండ్రోమ్ అనేది హ్యూమన్ ఇమ్యునో డిఫిషియన్సీ వైరస్ వల్ల కలిగే ఒక వ్యాధి, ఈ వైరస్ రోగ నిరోధక వ్యవస్థను బలహీన పరుస్తుందని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు.

**లక్ష్యం**

ప్రపంచవ్యాప్తంగా హెచ్ఐవి/ ఎయిడ్స్ నివారణ చికిత్స, ఈరోజు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు హెచ్ఐవి ఎయిడ్స్ బాధితులకు సంఘీభావం తెలిపేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. యుక్త వయసు వారు అందరూ సురక్షితమైన లైంగిక చర్యను పాటించాలి. కండోమ్ ను వాడాలని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి వైద్యాధికారులు డాక్టర్ జగదీష్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ ఉష, డాక్టర్ బిందు, డాక్టర్ శ్వేత, డాక్టర్ ప్రవీణ, హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్లు శ్రీరామ, చంద్రకళ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల పారామెడికల్ ట్రైనీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నిరాడంబరంగా మాజీ చైర్మన్ బద్దం
# ఎస్. సుభాష్ రెడ్డి వర్ధంతి వేడుక



ఎల్బీనగర్, డిసెంబర్ 01(భారత శక్తి): గడ్డిఅన్నారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్, గౌరవనీయులు స్వర్గీయ బద్దం ఎస్.సుభాష్ రెడ్డి 6 వ వర్ధంతిని పురస్కరించుకొని, బీజేపీ గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షులు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో పి అండ్ టీ కాలనీ చౌరస్తా వద్ద వర్ధంతి కార్యక్రమం శ్రద్ధాంజలితో జరుపుకొన్నారు. స్థానిక ప్రజలు, అభిమానులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సుభాష్ రెడ్డి సేవలను స్మరించుకున్నారు.సుభాష్ రెడ్డి 6 వ వర్ధంతిని పురస్కరించుకొని గడ్డిఅన్నారం డివిజన్ జిహెచ్ఎంసి పారిశుద్ధ్య సిబ్బంది, ఎంటామాలజీ సిబ్బందికి చలి స్వెట్టర్లు, గ్లౌజులు బిజెపి నాయకులు కార్యకర్తల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ కార్పొరేటర్లు రంగా నర్సింహా గుప్తా, నాయికోటి పవన్ కుమార్, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు దాసరి మల్లేశం, చిలకూరి రాంరెడ్డి తదితరులు పాల్గొని, సుభాష్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆయన ప్రజాసేవా పట్ల చూపిన అంకితభావాన్ని కృతజ్ఞతతో స్మరించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా మాట్లాడుతూ, సుభాష్ రెడ్డి ఎల్లప్పుడూ ప్రజల కోసమే పనిచేసిన నాయకుడు. పార్టీ బలోపేతం, కార్యకర్తల అభివృద్ధి, మున్సిపాలిటీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి అమోఘం. వారు చూపించిన మార్గం నేటికీ మాకు స్ఫూర్తి అందిస్తోంది..ఈ సందర్భంగా కార్పొరేటర్ నాయికోటి పవన్ మాట్లాడుతూ, రాజకీయాల్లో నాకు గురువు బద్దం సుభాష్ రెడ్డి, వారి లాంటి పరిపూర్ణ నాయకుడు అరుదు. మున్సిపాలిటీకి అత్యధిక నిధులను తెచ్చి చారిత్రక అభివృద్ధి సాధించిన నాయకుడు. వారి కలలను నిజం చేసేందుకు మేమంతా కట్టుబడి ఉన్నాము.ఈ సందర్భంగా కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మా నాన్న వర్ధంతి కార్యక్రమం జరుపుకోవడం మనసును బాధ కలిగిస్తుంది. వారు లేక ఆరు సంవత్సరాలు అయినా, ప్రతి కాలనీలోకి వెళ్లినప్పుడు మీ నాన్న మా ఇంటికి వచ్చి పలకరించేవారని ప్రజలు చెప్పడం చూస్తే వారు ప్రజల హృదయాల్లో ఎంత స్థానం సంపాదించుకున్నారో అర్థమవుతోంది. నాన్న చైర్మన్‌గా ఉన్న సమయంలో సీసీ రోడ్లు, నాలా పనులు, డ్రైనేజీ పనులు, కాలనీ సౌకర్యాల అభివృద్ధి వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గడ్డిఅన్నారం డివిజన్ ను అభివృద్ధి దిశగా నడిపించారు. వారి ఆశయాలను నెరవేర్చే దిశగా సేవ చేస్తున్నానని తెలిపారు.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు దాసరి జయ ప్రకాష్‌మాట్లాడుతూ, సుభాష్‌రెడ్డి చేసిన సేవలు, వారు ప్రజలతో ఉన్న అనుబంధం, పార్టీపై చూపిన నిబద్ధత గురించి స్మరించి, వారు చూపిన మార్గంలో ముందుకు సాగేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆనంద్ కుమార్, శ్రీధర్ రెడ్డి, నర్సింహా, శ్రీనివాస్, చిలకూరి జనార్దన్ రెడ్డి, సుందర్ నారాయణ, సుబ్బారెడ్డి, మురళి, నగేష్‌నాయక్, సుజాత, శ్రీలక్ష్మి, రాజేశ్వరి, ధనరాజ్, సిరి, శిరీష, సందీప్, సతీష్, హనుమంత్ రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్, అనిల్, లోకేష్, మహేష్, శ్రీకాంత్ నాయుడు, శరత్, వంశీ యాదవ్, సిద్దు, రఘునందన్ జోషి, టీంకు, శశాంక్, హరీష్,నానీ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం : మొద్దు లచ్చి రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబర్ 01 (భారత శక్తి): బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ప్రారంభించిన సీసీ రోడ్ల పనులను బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాలనీవాసులతో కలిసి పర్యవేక్షించారు. సాయిరాం కాలనీలో 17.50 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం. ఆఫీసర్స్ కాలనీలో 34 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం.ఎన్జీఓస్ కాలనీలో 21 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం. శ్రీపురం కాలనీలో 18 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణపు పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో త్వరలోనే ఒకటొకటిగా ప్రతి అభివృద్ధి,సమస్యల పరిష్కారానికి కృషి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సాయిరాం కాలనీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఆఫీసర్స్ కాలనీ అధ్యక్షులు బాలాజీ, శ్రీపురం కాలనీ ఫేస్ 2



అధ్యక్షులు ముత్యంరావు పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్ రావు,ప్రధాన కార్యదర్శి గంగం ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు జయపాల్ రెడ్డి, ఓబిసి మోర్చా అధ్యక్షులు మహేష్ గౌడ్,బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్, నాయకులు సుధీర్, హరికృష్ణ, మధుసూదన్ రెడ్డి,గిరి, శివకుమార్, సాయిరాం తదితరులు ఉన్నారు.




## జర్నలిస్ట్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన
# మహా ధర్నా విజయవంతం చేయాలి : శ్రీకాంత్ రెడ్డి

* **ఎల్బీనగర్ లో మహా ధర్నా కరపత్రం ఆవిష్కరణ**

ఎల్బీనగర్, డిసెంబర్ 01 (భారత శక్తి): తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియుడబ్ల్యూ జె) ఆధ్వర్యంలో ఈ నెల 3న హైదరాబాద్లోని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద తలపెట్టిన మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కే. శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మేకల సత్య నారాయణ జాతీయ కౌన్సిల్ సభ్యులు ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ మొగిలి, హెల్త్ క్యాంపు కన్వీనర్ శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్యామ్ ప్రసాద్ జోన్ ఇంచార్జీలు దశరథ శ్రీనివాస్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. జర్నలిస్ట్ జీవితాలు గత పుష్కర కాలంలో ఏ మాత్రం మెరుగుపడలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పొందిన ఆరోగ్య భీమా వంటి సౌకర్యాలు సైతం అందకుండా పోయాయన్నారు. 10 ఏళ్ల పాలనలో టిఆర్ఎస్ ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి.ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో పయనిస్తుందన్నారు. జర్నలిస్టులకు అక్రిడేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలన్నారు. ఆరోగ్య భీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. అరులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని తెలిపారు. వృత్తి కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలని, ఆరోగ్య భీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలి. అరులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేసి వృత్తి కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టులు అందరూ ధర్నాలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసి మన సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మల్లేష్ గౌడ్, గణేష్, శ్రీనివాస్, శ్రీనివాస్ రావు, మహేష్, ఉదయ కుమార్ పాల్గొన్నారు.







## జీహెచ్ఎంసీ విస్తరణ
# ఆర్డినెన్స్‌లకు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్, డిసెంబర్ 01 (భారత శక్తి): : జీహెచ్ఎంసీ విస్తరణ ఆర్డినెన్స్‌లకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల చట్టాల సవరణ ఆర్డినెన్సులకు ఆమోద ముద్ర వేశారు. జీహెచ్ఎంసీలో 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు విలీనం చేయాలని ఇటీవల తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ఆర్డినెన్సులకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్) లోపల, దాన్ని ఆనుకుని బయట ఉన్న 27 నగర, పురపాలక సంఘాలను గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ)లో విలీనం చేయాలని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ విలీన ప్రక్రియ ముగిశాక... ఐదు జిల్లాలు, 47 మండలాలు, 311 గ్రామాల పరిధిలో ఆరు పార్లమెంటు స్థానాలు, 28 అసెంబ్లీ స్థానాలతో దేశంలోనే అతి పెద్ద నగరంగా హైదరాబాద్ విస్తరించనుంది.

## ఏసీబీ డీఎస్పీ ముసుగులో వసూళ్లు..
# ప్రధాన నిందితుడు సహా ఐదుగురి అరెస్టు

వరంగల్ క్రైం, డిసెంబర్ 01 (భారత శక్తి): : ఏసీబీ డీఎస్పీ అధికారి ముసుగులో ప్రభుత్వ అధికారులను బెదిరిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ఘరానా ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడితో పాటు అతడికి సహకరించిన మరో నలుగురిని వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్, మిల్స్ కాలనీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. అరెస్టయిన నిందితుల నుంచి పోలీసులు ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రాచంపల్లి మంగళ శ్రీను అలియాస్ వాసు(45)ని ఏపీలోని సత్యసాయి పుట్టపర్తి జిల్లా వేలమద్ది గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. మిగతావారు కర్ణాటకకు చెందినవారిగా గుర్తించారు. ప్రస్తుతం సూర్యప్రకాశ్, తాటిమర్రి వేణు, కొత్తకోట రమణ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన



వివరాల ప్రకారం.. ''పోలీసులు అరెస్టు చేసిన ప్రధాన నిందితుడు రాచంపల్లి శ్రీనివాస్.. ప్రభుత్వ శాఖల్లోని ఉన్నత పదవుల్లో పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులతో పాటు పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని వారికి ఏసీబీ డీఎస్పీనంటూ ఫోన్ చేసేవాడు. 'మీ మీద అవినీతి ఆరోపణలు వచ్చాయి, కేసు నమోదైంది. ఈ కేసు నుంచి బయటపడాలంటే డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది' అని బెదిరించి సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. ఇందులో భాగంగా నిందితుడు వరంగల్ జిల్లా రోడ్డు రవాణా శాఖలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న తుమ్మల జైపాల్ రెడ్డికి ఫోన్ చేసి ఏసీబీ డీఎస్పీనంటూ బెదిరించి సుమారు రూ.9.96 లక్షలు వివిధ మార్గాల్లో దోచుకున్నాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.